శ్రీ

సీతాకల్యాణము.

ఇది

బళ్లారిలో వకీలుగానుండిన

కోలాచలం - శ్రీనివాసరావుచేత

రచియింపఁబడినది.

కోలాచలం - శత్రుఘ్నరావువలన

ప్రకటింపఁబడియె.

మొదటి కూర్పు.

చెన్నపురి

కలారత్నాకర ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1922.

[క్రయము రూ. 1—0—0.]

శ్రీరామ స్సహాయోఽస్తు.

శ్రీమేధా దక్షిణామూర్తిః ప్రసీదతు.

ఆంధ్రనాటకముల ననేకములు రచించి జగత్ప్రసిద్ధిఁ గాంచి కీర్తి శేషులయిన బ్రహ్మశ్రీ కోలాచలం శ్రీనివాసరావుగారిని వారికవితా మాధుర్యమును గల్పనాచాతుర్యమును నెఱుంగనివా రీయాంధ్ర ప్రపంచమున నుండరనుట యతిశయోక్తిగాదు. మరలఁదత్ప్రశంస గావించుట పిష్టపేషణం బగు నోకో యని శంకించెదను.

వా రాంధ్రభారతికి సమర్పించిననవీనాలంకార నాటక భూష ణములలో నీ సీతాకల్యాణనాటకమనునది యొకటి. ఇదియుఁ దక్కిన భూషణములకుఁ దీసిపోవునది గాదు. లలితసందర్భము కలిగి కల్పనాచాతు ర్యమున వెలసి, కోమల పదాలంకారభావముల బెరసి, ప్రయోక్తల కును ప్రేక్షకులకును బాలకులకును దన్నయత్వము నాపాదించు భావ నాశక్తి నెనసి విరాజిల్లుచున్నదని యొరులు చెప్ప నక్కఱలేకయె రసికు లెఱుంగఁగలరు.

ఇది యిన్నిదినంబులు ముద్రితముగాక యొకమూలఁబడియుం డుట మిగుల శోచనీయము. ఆంధ్రభారతి యీనాటకభూషణమును దాల్చువం తిన్నిదినములకు వచ్చెఁ గాఁబోలు దీనిని వారియందలి భక్తి విశ్వాసములచే వెలికిఁదీసి లేఖక ప్రమాదస్ఖాలిత్య ధూళిని దుల్చి స్వీయద్రవ్యవ్యయమున ముద్రణమును మెఱుఁగిడి యాంధ్ర

భారతికిం దొడిగి రసికుల సంతోషసాగరమున నోలలాడించిన మ-రా-రా-శ్రీ కరణం నారాయణరావుగారు మిగులఁ బ్రశంసనీయులు. ఇట్లె వీరిశ్రవ్యదృశ్యగ్రంథరత్నభూషణముల నన్నింటిని మెఱుఁగిడి ముద్రితములఁ గావించి లోకమున వెలయించిన నాంధ్రభారతీ శృంగారము సర్వజనవిదితంబయి సర్వజన శ్లాఘ్యముగాదె. అట్టి భాగ్యము శీఘ్రములోనే దేవుఁ డాంధ్రలోకమునకుఁ బ్రసాదించుఁగాక.

ఇట్లు విన్నవించు,

చింతలపల్లి - నరసింహశాస్త్రి,

ప్రధానాంధ్రపండితుఁడు,

మునిసిపల్ హైస్కూలు,

బళ్లారి.

22—7—1922.

శ్రీనివాససుకవి జీవితచరిత్ర.

ఎవ్వాని వదనరాజీవరంగస్థలంబున నలువరాణి నిచ్చలును నట్టువలు నలుపుచుండునో! ఎవ్వాఁడు కువ్యాఖ్యావిషమూర్ఛితయగు కాళిదాస కవితాసుకన్యకను దనదు సంజీవినిచేఁ దెప్పిఱిల్లఁజేసి ఒజ్జలమిన్నయని పన్నెకెక్కెనో! ఏమహామహు దివ్యనామామృతమును వీనులారఁ గ్రోలనియత్నశూన్యుఁ డొక్కఁడైన నీభువిని గానంబడఁడో! ఏమహితచారిత్రుని యశఃకుసుమంబుల ధరియించి దివాకర నిశాకరులు పుష్పవంతులను సార్థకనామమును బడసిరో!

ఏవిద్వద్వతంసుఁడు అనన్యజన సామాన్యమగు మహామహోపాధ్యాయ బిరుదమునకు మార్గదర్శియయ్యెనో! అట్టి చుళుకీకృత సకల శాస్త్రజలధియగు కోలచల శ్రీమల్లినాథసూరి వంశమున మన శ్రీనివాస కవిముక్తామణి విరూపాక్షక్షేత్రమునకు సమీపమునసుండు కామలాపురమను గ్రామమునఁ గ్రీస్తుశకము 1854-3-13 తేదీలకు సరియగు ప్రమాదీచ సంవత్సర ఫాల్గుణాసిత చతుర్దశినాఁ డుద్భవించె. ఇతఁడు బాల్యముననే సంస్కృతభాషను జక్కఁగ నభ్యసించి, పిదప నాంగ్లేయ భాషయం దసమానవైదుష్యమును గడించి, కొంతకాలము రాజకీయోద్యోగిగనుండి, తర్వాత న్యాయవాదిపరీక్షలయం దుత్తీర్ణుఁడై బళ్లారిపురవరమున న్యాయవాదిగ వఱలుచుండె. ఇతనికి నొకకూఁతురును, నలుగురు కుమారులును గలరు. మఱియు నితఁడు 1917 సం॥ ఏప్రెల్ 7 తేది దేహళీపురమున జరిగిన విద్వత్సభ యని ప్రసిద్ధిఁ గాంచిన యాంధ్రసాహిత్య పరిషత్సభ కగ్రాసనాధిపుఁడుగ నియమింపఁ బడియుండె. ఇట్లుండ నేతత్కవిచంద్రుఁడు రాజవ్రణపీడితుఁడై యాంధ్ర కువలయంబు వసివాడఁగ కుకవిచక్రంబు లుల్లసిల్ల 1919 సం॥ జూన్ 28 తేది యస్తమించె.

ఇట్లు విన్నవించు,

సుధీజన విధేయుఁడు,

☞ రావాడి - వెంకటరామశాస్త్రి,

తెనుఁగు పండితుఁడు, మునిసిపల్ హైస్కూలు, బళ్లారి.

పురుష పాత్రధారులు.

1. శ్రీమన్నారాయణుఁడు
2. నారదుఁడు.
3. పర్వతుఁడు.
4. తుంబురుఁడు.
5. రావణుఁడు.
6. అగ్నితేజసులను మునికుమారులు.
7. విభీషణుఁడు.
8. అమాత్యుఁడు. (మంత్రి)
9. జనకమహారాజు.
10. సుబుద్ధి.
11. దశరథుఁడు.
12. వసిష్ఠులు.
13. సుమంత్రుఁడు.
14. విశ్వామిత్రుఁడు.
15. రాముఁడు.
16. లక్ష్మణుఁడు.
17. మాయారాముఁడు.
18. పరశురాముఁడు.
19. రాజులు.
20. మంత్రులు.
21. బ్రాహ్మణులు.
22. హాలికులు.
23. ఫణిహారి.
24. బాలురు.
25. మునిశిష్యులు.
26. మరీచసుబాహులు.
27. చారులు.
28. రాక్షసులు.

స్త్రీపాత్రలు.

1. లక్ష్మీదేవి.
2. రమాదేవి.
3. మండోదరి.
4. సీత.
5. తాటకి.
6. అహల్య.
7. మోహిని.
8. మాయాసీత.
9. ప్రియంవద.
10. భద్ర.
11. ఊర్మిళ.
12. ముత్తైదువులు.

ఏతద్గ్రంథకర్తచే రచియింపఁబడిన యుపన్యాసములు, నాటకములు.

1. భారత భగవద్గీతలను గుఱించిన విమర్శనము.
2. వ్యవహార కర్మజిజ్ఞాసము.
3. అర్జున విషాదయోగము.
4. సాంఖ్యయోగము.
5. కర్మయోగము.
6. జ్ఞానయోగము.
7. కర్మసన్న్యాస మంత్రలయ పాతరాజయోగములు.
8. ధ్యానయోగము.
9. విజ్ఞానతారక బ్రహ్మయోగము.
10. రాజవిద్యా రాజగుహ్య విభూతి యోగములు.
11. విశ్వరూపసందర్శన భక్తియోగములు.

ఉపన్యాసముల పేర్లు

1. ఆర్యుల నాగరికత వారి ప్రపంచ వ్యాపకత.
2. ఆర్యుల చరిత్ర, ఋగ్వేదభాష &c
3. ఋగ్వేదము విభజన వేదకాల విభజన &c.
4. ఆర్యులు పంచాబు చేరిన విధము వారి శాసనము.
5. మద్యపానము జూదము స్త్రీలగుణములు c.
6. వివాహ కట్టనములు.
7. జాతి చట్టములు.
8. సృష్టిని గుఱించిన తాత్పర్యము.
9. వేదమతము నాస్తికమతము అర్యుల దైవములు.
11 నరమేధ అశ్వమేధాది యజ్ఞములు.
10. అతిది ద్వాదశాదిత్యులు &c.
12. యము యమి మృత్యువు పితృదేతలు కర్మ &c
13. సోమపానము అశ్వినులు రుద్రుఁడు పర్జన్యుఁడు &c
14. ఋషులు సప్తర్షులు దధీచి, చవనుఁడు &c.
15. ఋగ్వేదములోని ముఖ్యప్రార్థనలు.
16. మతవిధులేరీతిగఁ బ్రబలినది.
17. నాటకముల గుఱించి ప్రపంచములో నాటకపాత్ర లెటుకీర్తిగాంచిన దిన్ని వారియభినయాది లక్షణములను గుఱించిన్ని వ్రాయబడిన యాఉపన్యాసములుగల గ్రంథము

షరా.—పైయుపన్యాసంబులలో నింకను ననేకవిషయములున్నవి. జాబితాలో వివరములన్నియును వ్రాయ సాధ్యముకాదు. ప్రతియొక శాస్త్రమునందు నార్యులు ప్రావీణ్యముంది యుండిరనుటకుఁ బ్రమాణములు చూపఁబడినవి.

చరిత్ర నాటకములు.

1. రామరాజు చరిత్రము లేక (కర్ణాటక రాజ్య నాశనము.)
2. సుల్తానా చందబీ.
3. చంద్రగిర్యభ్యుదయము.
4. మైసూరు రాజ్యము.
5. శిలాదిత్య.
6. సుఖమంజరీ పరిణయము.
7. ప్రతాపాక్బరీయము.

శ్రీరస్తు.

నాంది.

ఉ. శ్రీరామా రఘురామ రాఘవ నినున్ బ్రేమించుసద్భక్తిచే
హేరాళంబుగఁ బూజసల్పుదును నాహృత్పంకజ పీఠంబునన్
బోరామిన్ దగనిల్పి భూజనులకున్ మోదంబు నందింపరా
ధీరా! దాశరథీ దయా జలనిధీ దివ్య త్కృపాంభోనిధీ.

అనుబంధము 1.

సీ. భ్రాజిత కవిసార్వ భౌముఁడై నాటక
కవి చక్రవర్తియై క్రాలు నెవఁడు,
ప్రాపంచ నాటక ప్రభవోర్జితాదులఁ
బ్రకటించి బోధించు ప్రాజ్ఞుఁడెవఁడు,
చరితాంశ నాటక సారపూరితములౌ
రూపకంబు లొనర్చె రూఢినెవఁడు,
స్వల్పకాలము నందనల్ప నాటకకావ్య
రచనల కోటిచె రహినెవండు.

గీ. అభినయ జ్ఞానసంపూర్ణ తాధికారి
యై వెలుంగెడు రసిక శిఖావతంసు
డెవఁడు బళ్లారి పురములో నెలమిగాంచు
వాసిఁగనినట్టి కె. శ్రీనివాసుఁడతఁడె.

శ్రీ

సీతాకల్యాణము.

పూర్వరంగము.

(శ్రీమన్నారాయణుఁడు వైకుంఠంబున నాదిశేషునిపైఁబరుండియుండ లక్ష్మీదేవి కూర్చుని యుండును. పరిచారికలిరువురు వీవెనలు విసరు చుందురు. తుంబుర పర్వతులను గాయక శిఖామణులు పాడు చుందురు)

నారదుని ప్రవేశము.

అనుబంధము 2.

నారదుఁడు.—(ఆగ్రహము వహించి నిలిచి) ఏమీ! బ్రహ్మమానసపుత్రుఁడనై వేదాంత విద్యావిశారదుఁడగు నారదుఁడు నేను వచ్చి నిలచియుండ నన్ను సరకు సేయక తమ గానరసార్ణవములో నీ పర్వతతుంబురులు మునిఁగిపోయినారు? ఈ లక్ష్మి తానుహరిప్రియయనియును, శ్రీహరిహృదయంబున సదాకాలంబు వర్తించు దాననియును, లోకజనని తానేయనియు, గర్వించి, ననుఁబోలు మహనీయునిఁ గన్నెత్తియయినను జూడక, సత్కరింపక, యొక యుపచారఁపుఁబల్కయినను బల్కక నిక్కినీల్గుచున్నది. తుదకీపరిచారిణులు తమకుఁ గల స్థానబలగర్వమున నన్నెన్నక యున్నవారు. నీచులకు సంపద గలిగిన నిక్కుదురను మాట సార్థకమయ్యెను.

పరిచారికురాలు.—ఏమయ్యా నారదా! తరతమంబులు గుర్తెఱుఁగక మాటలాడెదవు, మేము నీచులమా? అది యెట్టుల? సదాకాలము హరిభక్తి సేయుచుండక, హరిభజనాతత్పరలై, హరిపాదాంబుజములు సేవించువారు నీచులగుదురా? వైకుంఠమునకు వచ్చినను నీ కుంఠతనము మానక, యహంకారమమకారముల హెచ్చిమాటలాడు నీకు మేము వెఱతుము, హెచ్చు మాటలాడకు.

పర్వతుఁడు.—నారదా! అరిషడ్వర్గమును జయించిన వారుగదా హరిపాదాంబుజములు గందురు. సదాకాలము హరిచరణ సేవాపరాయత్తచిత్తలగు నీ పరిచారిణులు నీచు లెట్లగుదురు?

తుంబురుఁడు.—నారదా! మదమత్సరాధీన మానసుఁడవయి, హరి సేవాపరలగు నీ పరిచారిణుల దూషించి యేల నీ నారదనామము సార్థక పఱచి కొనియెదవు? చాలు చాలు నీదారిని నీవు పొమ్ము.

నారదుఁడు.—ఓరీ! తుంబరపర్వతులారా? నాసన్నిధిని మీరు వింజామరకిడినభంగిఁ బడియుండక నన్నెదిరించి మాటలాడెదరా? ఔరా! మీగర్వము మితిమించెను. మీకింతటి యున్నత పదవి కూడదు మీరు భూలోకమున మానవులై పుట్టుఁడి.

లక్ష్మీదేవి.—నారదా! ఏమి హెచ్చుమాట లాడఁజొచ్చితివి. నీ మత్సరబుద్ధి మానుమిఁక. లోకమాతనగు నేను నిన్ను సత్కరింపవలెనా? ఔరా మదము! గానప్రియనై యీతుంబరపర్వతుల గానరసార్ణవమునఁ దేలుచుండ నంతరాయముగ నీవు వచ్చినది చాలక యెదిరించి హెచ్చుమాట లాడెదవా? మిన్నుమన్నెఱుఁగక వెనుకముందారయక మాటలాడవలదు బ్రహ్మమానస పుత్రుఁడ నేనని గర్వింపవలదు. నీ విచట నిలుచుట తగదు. వెడలిపొమ్ము.

నారదుఁడు.—(కోపమునఁ గనులెఱ్ఱఁ జేసికొని.)

ఉ. మానిని! మాధవుండు నిను మానక యెత్తటి ప్రేమ్మ నందునన్
బూనుచునుండునన్నుఁ బలుబూమెలు పోయెదు గాన, నీవిఁకన్
మానవభామవై మగనిమానినదుఃఖముచేత గ్రుంగుచున్
దానవనాథు బాధలకు దక్కుచునుండువు గాత ధాత్రిలోన్.

సంపదచే నిక్కువారిగతి యిదియేను.

అనుబంధము 3.

(నిష్క్రమించును.)

లక్ష్మీదేవి.—హా! హా! ఇఁక నేమి నాగతి? జగదీశుఁడగు మగని వదలి నే నెటు మనఁగలను?

అనుబంధము 4.

తుంబురుఁడు.—ఊరకయుండక యుబుసుపోకకు మందుతీసికొనినటుల నారదుని నెదిరించి శాపతప్తులగుండవలసిన ప్రాప్తి తెచ్చికొంటిని. ఇఁక శ్రీహరి కరుణతప్ప వేఱు మార్గము నే నరయఁజాలను.

అనుబంధము 5.

శ్రీమన్నారాయణుఁడు.—(నిద్రలేచి అందఱినిఁజూచి) ఏమిది! నాసరసను జేరి సంతోషసాగరంబున నోలలాడక వీరు చింతాబ్ధిలో మునిఁగినారు. ఏమి కారణముండును. (ఇంచుక యాలోచించి తలయూఁచి) సరి వీరి వ్యసన కారణంబు వారినుండియే తెలిసికొని, తన్నివారణంబునకుఁ బ్రయత్నించెద. (పర్వతతుంబురులను జేరి) ఏమి! తుంబరపర్వతులారా! మీమీ గానసైపుణ్యముఁ జూపక వాద్యసాధనములు సరకుసేయక ముఖాంబుజంబులు వాడు వాఱ చిన్నబడితిరేల? ఇంతటి ఘోరకారణం బేమి పొసంగెను.

తుంబరుఁడు.—

ఉ. శ్రీహరి తావకీనపదసేవ యొనర్పఁగ గానలోలతన్
దేహము నేమఱిల్లుచు మదిన్ మఱినెద్దియుఁ గానసైతి; నా
సాహసమాని నారదుఁడు చయ్యనవచ్చి తిరస్కరించి, ని
ర్మోహత శాపమిచ్చె సరరూపముఁదాల్పఁగ నక్కటా మహిన్.

ఆపద్బాంధవా! ఇదియ నా చింతకుఁ గారణంబు.

పర్వతుఁడు.—అనాథరక్షకా! జగదీశా నా చింతకును గారణం బదియేసు? మహిలో మనుజరూపం బెత్తి నీ దర్శనలాభంబందక నేనుండఁ జాలను.

శ్రీహరి.—(లక్ష్మీదేవిం జేరి) ప్రేయసీ.

కం. చింతకుఁ గతంబ దెద్దియొ
యంతయు నే నెఱుఁగఁ దెల్పు మతిశీఘ్రముగన్
గాంతామణి, నేనిపుడే
వంతన్ దీర్చెదను, నిక్కువము బల్కెదఁగన్.

ప్రేయసీ! నీకింతటి దుఃఖంబు గలుగఁ గారణం బేమి? నే నేమయినను నీకుఁ దప్పొనరించితినా? ఏ కాలంబున నిన్నగలియుండిన నీకెంతటి కోపంబు వచ్చునో యని భీతిల్లికదా సదాకాలము నావక్షస్థలమే నీవాసస్థానముగ నేర్పఱచి కాపాడు చున్నాఁడను. నీ కనుసన్నమెలఁగుచున్నవాఁడను. నీపుట్టినిల్లే నానివాసస్థానముగ నేర్పఱచికొని యున్నాఁడను. ఇట్టి నాయనుగ్రహముగల నీకు నేకారణంబున నింతటి చింతసంభవిల్లెను.

లక్ష్మీదేవి.—ప్రాణనాథా! నీయందుఁ దప్పేమియు లేదు. నా గ్రహచారమునకు నెవరేమి సేయఁగలరు? చతుర్దశలోకంబులు తనబొజ్జనిడికొని యేలు నీవు నాకుఁ దలయి నన్నొకాలంబున నెడబాయక యున్నవాఁడవని గర్వించితి. ఆ గర్వ ఫలమిపు డనుభవమునకు వచ్చెను. నాయనుగ్రహము లేనివారందఱు నన్న నేక విధముల దూషించుచుందురు. దానికి నేఁ జింతింపను. నాకోడలగు సరస్వతి నన్ను దూషించును. దానినే సరకు సేయనైతిని. ఆయమపుత్రులు కవులై నా యనుగ్రహము నందఁజాలక నేను చంచలననియును ననేకుల నాశ్రయించు దాననియును, మగని నెడదన్ను ధూర్తననియును జడజనని ననియును నిందించుచుందురు. నాకుగని యనుగ్రహము నాపై నుండఁ గాని వారు కానిమాటలేమి యాడినను నాకేమి కొదువయని చింతింపనైతిని.

శ్రీహరి.—ప్రేయసీ! చింతకుఁ గారణం బొకటి రెండుమాటలతోఁ దెల్పక యేమేమో చర్యలు జరుపుచున్నావు.

లక్ష్మీదేవి.—నాథా! స్త్రీలకది స్వాభావికముగ లభించిన గుణము దానిని మార్ప నెవరివశము?

శ్రీహరి.—మోహనాంగీ! స్త్రీలగుణము స్త్రీలకుఁ జక్కఁగఁ దెలియును నాకేమి తెలియును. ఇపుడు స్త్రీలమాటలేల? నీచింతకుఁ గారణంబేమి?

లక్ష్మీదేవి.—నాథా! ఇంతకుమున్ను మీరు పరుండి నిద్రించుచుంటిరి కదా?

శ్రీహరి.—నిజము. నిద్రించుచుంటిని.

లక్ష్మీదేవి.—అపుడు పరిచారిణులు వీవెనలు విసరుచుండిరి కదా?

శ్రీహరి.—నిజము. వారివసియది. దానికేమి. చింతకుఁగారణంబు త్వరలో దెల్పుము.

లక్ష్మీదేవి.—ఇంత యాతురపడినచో నేఁ జెప్పఁజాలను.

శ్రీహరి.—(సవ్వ్యచు) కాని ప్రేయసీ! నీకేలకోపము? నీకోరిక నీ వనుసరింపుము.

లక్ష్మీదేవి.—అటులయినఁ దెలిపెద. అకాలంబునఁ బర్వతతుంబురులువచ్చి నిన్ను స్తుతించుచుఁ బాటలు పాడుచుండిరి.

శ్రీహరి.—వారెల్లకాలముటు లొనరించుట సహజమేను.

లక్ష్మీదేవి.—వారి గానమై పున్యమునకు నే మదిమెచ్చి మైమఱచియుంటిని.

శ్రీహరి.—చక్కఁగాఁ బాడువారిపాటలు విన్నవారందఱు మైమఱచుట సహజమగును.

లక్ష్మీదేవి.—సహజము కానిమాటలు నేనాడను.

శ్రీహరి.—నీ వాడుదువని యెవరు పలికిరి? ఇన్నిమాట లాడితివిగాని చింతకుఁ గారణంబు దెలుపవుకదా?

లక్ష్మీదేవి.—ఏమి! యింత యాతురపడియెదరు. తామెచ్చటికైనను బోవు పనియున్నదియా యేమి?

శ్రీహరి.—సదాకాలము నాకు నీపనియేగాని వేఱుపని లేదు. నీచింతకుఁగతంబుఁ దెలియ నాతురపడుచున్న వాఁడను.

లక్ష్మీదేవి.—దానినే నేఁ జెప్పుచున్నానుగదా? ఆపర్వతతుంబురులు పాడుచుండ నెచ్చటనుండియో పిడుగుపడినట్లు వచ్చెను.

శ్రీహరి.—ఎవరువచ్చిరి?

లక్ష్మీదేవి.—మఱి యెవరున్నారు. ఆ కలహప్రియుఁడు నారదుఁడు.

శ్రీహరి.—హా! హా! పెద్దలువారు దయచేసియుండిరో సరే.

లక్ష్మీదేవి.—ఆ కలహప్రియుఁడే వచ్చియుండెను.

శ్రీహరి.—వచ్చి.

లక్ష్మీదేవి.—వచ్చి తన్నెవరు సత్కరింపలేదని యేమీయెఱుఁగని యాపరిచారికులను దూషించెను.

శ్రీహరి.—పిదప.

లక్ష్మీదేవి.— దానికి సహింపనోపక యాగాయకు లెదిరించి మాటలాడిరి. వారిపై నాగ్రహించి మానవులుగ భూమిలోఁబుట్టుఁడీ యని వారికి శాపమొసఁగెను.

శ్రీహరి.—ఏంతటి గ్రహచారమిది? దీని కేదయినను సదుపాయంబుఁ గల్పింప వలెను. కల్పించెద. ఇదియేనా, నీచింతకుఁ గారణంబు?

లక్ష్మీదేవి.—ప్రాణనాథా! ఇదియొక్కటియ గాదు. ఇఁక నాకుసంభవించిన యాపద యేమని తెల్పుదును?

శ్రీహరి.—ప్రాణేశ్వరీ ! నీ కేయాపద సంభవిల్లెను? సకల సంపదలుగల నీకు నాపదలు గలిగెననిన నెవరు నమ్ముదురు ?

లక్ష్మీదేవి.—నిజము ! నీయనుగ్రహముగల నాకెట్టి సంకటములుగాని యెక్కాలంబునఁ గలుగవని నమ్మియుంటిని. ఆ కలహప్రియునకుఁ బూర్వజన్మంబున నే నేమి విషముఁ బెట్టియుంటినో యెవరిజోలికిని బోనినన్ను శపించెను.

శ్రీహరి.—ఏమి ! ఏమి నిన్ను శపించెనా ? నిన్ను శపించెనా ? ఏమని ?

లక్ష్మీదేవి.—మోహనాంగా ! ఆమాటలు నేఁ దెలుప సంకటముగుచున్నది.

శ్రీహరి.—దేవి ! తెలుపకున్న నాకు సంకటముగాదా.

లక్ష్మీదేవి.—నిజము ! ఉభయులకు సంకటము.

శ్రీహరి.—కావున నాకది శీఘ్రముగఁ దెలిపినచోఁ దత్పరిహారంబున కేదైన సదుపాయంబు వెదకెద.

లక్ష్మీదేవి.—నాథా ! మునిశాపంబు మోఘము కాదా ?

శ్రీహరి.—కాదా మరి.

లక్ష్మీదేవి.—అయ్యో ! అటులయిన మీరెటు మరల్తురు ?

శ్రీహరి.—ప్రాణేశ్వరీ ! శాపమేమయినది తెలుపక యెన్నిప్రశ్నలు వేయుచున్నావే ?

లక్ష్మీ.—నాథా ! నేఁబ్రశ్నించుట మీకు వేసటయగునేని వదలెద.

శ్రీహరి.—నాతీ ! శాపమేమైనది తెలుపుము.

లక్ష్మీ.—నాథా ! నేను మర్త్యభామినినై పుట్టవలెనఁట.

శ్రీహరి.—నాతీ ! అటులయిన నేనును మర్త్యుఁడనై నీకు భర్తఁగ భూలోకంబునఁ బుట్టెద.

లక్ష్మీ.—కాంతా ! నీమాటలు నామానసంబున కెంతటి సంతసంబు గలిగించినను ముందువార్తఁ దెలుపఁ గఠినతరముగ నున్నది.

శ్రీహరి.—ప్రాణేశ్వరీ ! అంతయు దాఁపక తెల్పుము.

లక్ష్మీ.—నాథా ! నేనెటు తెలుపుదు ?

శ్రీహరి.—నాతీ! అది తెలుపకున్న నీకునాయన.

లక్ష్మి.—నాథా! భర్త వియోగము నాకుఁ బ్రాప్తించునఁట.

శ్రీహరి.—(నిట్టూర్పువిడుచుచు) హా! హా! కఠినము. కఠినము.

లక్ష్మి.—ప్రాణపతీ! అంతయే కాదు, నేను దానవనాథుని చెఱఁజిక్కి దుఃఖింపవలెనఁట.

శ్రీహరి.—హా! హా! ఎంతటి కర్ణకఠోర వాక్యమిది. విననోపను అమునీ నీకింతటి శాపమొసఁగెనా? అయ్యో కారణమేమి యుండును? (అనుచు నాలోచన నభినయించి) నాతీ! అంతయు నాకు స్ఫుటమాయెను. ఆ కలహప్రియుఁడు ముందు కాఁదగిన కార్యమాలోచించి నీకీ శాపమిడినాఁడు. వెఱవకు దేవ బ్రాహ్మణప్రీతికిఁగాను నీ వీశాపము ననుభవింపవలెను. నాయంశమును దాల్చి దశరథునకు సుతుఁడై శ్రీరామ నామమున రాముఁడు భూమియందవతరించి నారు. ఈతుంబరపర్వతము లగ్ని తేజస్సులను మునికుమారులై మహినిఁ బుట్టుదురు. నీ వొక బంగారు కలశమునుండి యాబుషికుమారులచేఁ బూజింపఁబడుదువు. అట్టికాలమున రావణుఁ డీ మునికుమారులఁ జంపి సువర్ణకలశము నెత్తికొనిపోయి నీచేధిక్కరింపఁబడిన కారణంబున సముద్రములోఁ ద్రోయును. పిదప జనకమహారాజు యజ్ఞవాటికయందుఁబుట్టి యాపుణ్యాత్మునికూఁతురై నాయంశమునఁబుట్టిన శ్రీరాములకు భార్యవయ్యెదవు నీకారణంబున దనుజనాథుఁడు చంపఁబడును. భూలోకమునకు సుఖదాయిని వయ్యెదవు.

లక్ష్మీదేవి.—నాథా! ఏది యెటులైనను సహింతును. నీయెడబాటు సహింపనోపను.

ఉ. సారసహీనమౌ సరసిచాడ్పున రాజితరాజతేజవి
స్ఫారత లేని రాత్రిగతి సౌరభరిక్తసుమంబురీతిగా —
శారిక లేని పంజరము సామ్యమునన్ బతిదండలేక యా
ధారుణి నుండుదానఁ బెఱిదమ్మిది కానవె యేమిసేయుదున్.

శ్రీహరి.—నాతీ! వ్యసనపడకు. వియోగము కొంతకాలమే యుండును,

లక్ష్మి.—కొంతకాలమైనను నేనెటు సహింతును ?

శ్రీహరి.—లోకసౌఖ్యమునకుఁగదా మనము పాటు పడవలెను ?

లక్ష్మి.—నాథా ! ఎటులయినను తమయానతి శిరసావహించెద. తమువశవర్తిని నేను.

శ్రీహరి.—తుంబరపర్వతులారా ! మీరు వ్యసనపడకుడి. భూలోకమున మీరు ఋషికుమారులై పుట్టుఁడి. మీకు శాపవిమోచనంబతి శీఘ్రముగ నగును.

తుంబరుఁడు.—దేవుని స్తుతించును.

అనుబంధము 6.

లక్ష్మి.—నాథా ! ఏటులయినను నీవియోగంబు చాలకాలంబు నను బాధింపనటులఁ జేయుము. నీపాదములఁ బడి వేఁడికొనియెద.

అనుబంధము 7.

శ్రీహరి.—నాతి ! చింతింపకు రమ్ము పోవుదము.

(నిష్క్రమింతురు.)

శ్రీ

సీతాకల్యాణము.

ప్రథమాఙ్కము—ప్రథమరంగము.

అరణ్యము.

(కామరూపమును ధరించిన రావణాసురుఁడు అగ్ని తేజసులను మునికుమారులు.)

రావణుఁడు.—

మ. త్రిదశాధీశుఁడు చిక్కెనా చెఱకు, నిస్తేజుండునై యగ్నినా
పదదాసుండయెఁ గాలుఁడుక్కుఁజెడి నాకాల్బంటుగానిల్చె నా
పదలన్ జిక్కెను క్రవ్యుఁడప్పతియు యాపన్నుండునై దక్కగా
లిదిశల్ బాఱెను రాజరాజునని హేళిన్ జేసి పాలించితిన్.

అనుబంధము 8.

అష్టదిక్పాలకు లెల్లఱు నాబారికి వెఱచి నాతో సంధిచేసికొని నాయింటఁ గొలువునకు నిలిచిరి. ఇంద్రునకు స్తుతిపాఠకుని కొలువిచ్చితి. అగ్నిని వంటలవానిఁ జేసితి. యమునకు వెత్రపువాని పని నిచ్చితి. వరుణుని నీళ్లవానిఁ జేసితి. నైరుతికి కానిసపని నమర్చితి. వాయువును వీవెనలు విసరు వానిని జేసితి. కుబేరుని బచ్చెన గానిఁ జేసితి. ఈశ్వరునిపై దాక్షిణ్యముచే నీశానుని నేస్తకానిగ నుంచుకొంటిని. సురగరుడోరగనర కిన్నరయక్ష రాక్షసగణంబులు నాకనుసన్న మెలఁగుచున్నవారు. యజ్ఞకర్మలు ప్రపంచంబున నామావశిష్టములాయెను. మునులు స్నానసంధ్యావందనాది కర్మములుమాని మూలమూలల డాఁగినాఁరు.........ఏమీ! నారదుఁడు నేఁడేమి పలికెను. అగ్నితేజస్సులనియెడు నిరువురు ఋషికుమారు లీ యరణ్యంబున నిరాహారవ్రతంబుఁ బూని యొక విచిత్రమగు బంగారుకలశమును బూజించుచు, ననుఁ జంపఁ

ప్రయత్నించుచున్నవారని కదా? హా! హా! హా! నన్నుఁజెంపఁ ద్రిమూర్తులకు సాధ్యంబుకాదనిన ముక్కుఁబట్టుకొని మూలలఁడాఁగిన మునికుమారులకా సాధ్యము? వెఱ్ఱిమాట లివి.........అయినను నేనేల యా మునికుమారులను బట్టి కుదముట్టింపవ రాదు. కుదముట్టించెద. ఇదే యరణ్యముగదా వారున్నవారని నారదుఁడు పలికెను. చక్కఁగ వెదకి వారెచటనుండునది కనుఁగొనియెద.

సీ. సర్వలోకంబులు సమయించునో యని
జడుఁడగు మృడుఁడు తాఁ జడియునెపుడు,
శతవృద్ధుసృష్టికి శక్తిచాలదటంచు
తప్పించుఁబనియని ధాతవెఱచు,
రక్షించు నెడపేఁడు పక్షపాతి యటంచు
శిక్షించునని భీతిఁ జెందు శౌరి,
ఒకఁడొకఁ డొకమూల నొదిగి దిగ్వరులెల్లఁ
గనుసన్నఁబనులన్ని వినుచుమనిరి.

గీ. భళిరె రావణుచలమును బలమువిన్నఁ
జావునకు సిద్ధపడియున్న జీవికైన
గుండె ఝల్లను, బ్రదికిన నుండవలదె
భూరిబల విక్రమంబులు భువిని నిటుల.

ఇట్టిపరాక్రమవంతుఁడగు నన్ను రూపుమాప నెవరికి సాధ్యపడును? అయిన నా మునికుమారు లెచట నున్నవారో. తెలియకున్నది. ఈ యరణ్యమంతయుఁ జక్కఁగ వెదకెద.

అగ్నితేజస్సులు.—(బంగారుకలశమునుఁ బూజించి నమస్కరించి.)

మ. అతిగర్వోద్ధతుఁడై దశాననుఁడు బాహాదర్పము మీఱఁగా
సతులన్బల్మినిఁబట్టుచున్ ద్రిదశులన్ సంతప్తులన్ జేయుచున్
యతులన్ దిట్టుచుఁగొట్టుచున్ మిగులహింసాత్ముండునై యుండు
నాదితివంశోద్భవుఁడాడిహెచ్చరయె రమాదేవిమముఁ గావవే.

రావణుఁడు.—ఔరా! వీరిమదము. నన్నుఁ జంపుమని రమాదేవిని నుతించుచున్నారు త్రిమూర్తులు నాబారికి వెఱచుచుండ, రమాదేవియఁట నన్నుఁజంపునది? ఏవీ వీరిని నేఁజంపెద, రమాదేవి యెటురక్షించునో చూచెద.

(అనుచు నగ్నితేజస్సులపై బాణములువేయ, వారు మృతులగుదురు, వారి రుధిరమును గలశములోనించి కలశమెత్తికొని) ఆహా! ఈకలశమెంత విచిత్రముగ నున్నది. అమూల్యమగు నవరత్నఖచితమైనది. దీనినిఁ గొనిపోయి నాయాస్థానము నందుంచెద.

అనుబంధము 9.

(నిష్క్రమణము.)

ద్వితీయరంగము.

(రావణుఁడు. మండోదరి. విభీషణుఁడు. మంత్రులు. రమాదేవి.)

రావణుఁడు.—మంత్రిపుంగవులారా! ఆలనాఁడా హిరణ్యగర్భుని దివ్యవరమంది, దోర్వీర్యంబున నసురులకు నాజన్మద్వేషియైన సురరాజునుఁ బోరున గెలిచి చెఱఁగొని మనపురికిఁ బంపితిని. పిదప నగ్నిని జయించి నిస్తేజునొనరించి నాయింటనుంటకు నిచటికిఁ బంపితి. సర్వప్రాణులకు మృత్యువనగు యమునిఁ గెలిచి వానిదండముతో వానిని శిక్షించి లంకకుఁ బంపితి నైరృతిని నిష్ఠురబాణములఁ బాల్పఱచి చెఱనిడితి. వరుణుని వారిధిలో మూడుమునుకలుముంచి మా పట్టణమునఁ బనులు నేయఁ బంపితి. పవనుని దశదిశలకుఁ బాఱించి పట్టి పంపితిని. ధనదునిరూపేద నొనరించి పుష్పకవిమానంబుఁగొని చెఱనిడితి. నే నిచ్చటికిఁ బంపినదిక్పాలుర మీరేపనులయందుంచినారు.

అమాత్యుఁడు.—దైత్యకులనాయకరత్నమా! వచ్చిన దిక్పాలకులను గని వారి వారి శక్తులకొలఁది వారికిఁ బనులనియమించినాను. తమకు సార్వకాలము సర్వభోగము లమర్చియుంచుటకుగాను సురరాజను నియమించితిని. అగ్నిని వంటల పనికి నుంచితి. యమునకు మఱి యేపనియు రానందునఁ దమ సరస బెత్తపు వానిగ నేర్పరించితి. నైరృతి మాకులమువాఁడు కావున మాపురికి కావలిపనికి నియమించితి, వరుణుఁడు నీళ్లుమోయు పనిఁదప్ప మఱియేపనికి నర్హుఁడు కాఁడం

మున వానినిఁ దమయింట నీటి పనికి నేర్పఱించితి. వాయువు తమకు వీవెన విసరుపనికి నియమించితి.

రావణుఁడు.—యుక్తానుసారముగఁ బనులిచ్చినారు. సంతోషమాయెను. అమాత్య పుంగవులారా! మఱియొక విచిత్రవార్త మీకుఁదెలిపెదను వినుఁడి.

మ. దితివంశోద్భవులార చిత్రమిది నేధీరత్వముల్ బూని, ది
క్పతులం గెల్చుచుఁ గానవంబుల యతిప్రాముఖ్యులన్ గొట్టుచున్
క్షితినెల్లన్ వడిఁ గ్రుమ్మఱించుతఱి నక్షీణంబుగా నారమా
సతినిన్ గొల్చుయతీంద్రులిర్వురిని నేసంహారమున్ జేసితిన్.

అమాత్యుఁడు.—రాక్షసకులాగ్రణీ! అనవద్యకర్మంబాచరించితిరి.

రావణుఁడు.—అమాత్యపుంగవా! ఆతాపసులయెదుట నీయమూల్యరత్నకలశం బుండినది. నానాశనముననై రమాదేవిని నుతించుచు నీకలశంబునుఁ బూజించు చుండిరి. నే విని యాగ్రహముఁబట్టఁజాలక వారిని సంహరించి వారి రక్తమును గలశములోనించుకొని వచ్చితిని. (మండోదరినింజూచి) ప్రేయసీ ఈకలశ పూరితరక్తమయమాంసమును రుచికరముగ నాకు వండించి పెట్టుము.

మండోదరి.—నాథా! అటులానరించెద. (అనుచుఁ గలశమంటును) అపుడేఁ కట్లనంగలశముపగలి లోనుండు రమాకన్యక వెడలి రావణునిఁజూచి.

రమాదేవి.—

మ. అగునా రాక్షసవంశనాశక పులస్త్యబ్రహ్మావంశుండవై
నిగమాచారవిచారముల్ మఱచుచున్ నీ విట్టిక్రూరంబులన్
తగునా సేయఁగ నిన్ను నీకులమునున్ దగ్ధంబుఁ జేయంగఁ గాఁ
దగ నేఁబుట్టితి నీకు మృత్యువుగనై ధాత్రిన్ ననున్ జూడరా.

(అందఱు నిశ్చేష్టతనివ్వెఱపడి నిలుతురు.)

రావణుఁడు.—వేదవతీ! అలనాఁడు నీవు నాపట్టుఁదప్పించుకొని యగ్నిలోఁబడి భస్మమైనటుల నటించి దాఁగితివి కాఁబోలు నీ యైంద్రజాలకవిద్య యిపుడు నేఁదెలిసితి. నేఁ డెందు దాఁగెదవో నీ కెవరు శరణో చూచెద? ఇపుడు నిన్ను సంహరించెద.

అనుబంధము 10.

రమాదేవి.—ఓరీ మూర్ఖా ; నన్ను సంహరించెదవా, నీకీపుడంటి బాధించు బ్రాహ్మణహత్యకుఁ జేరికగ స్త్రీహత్యయను దోషంబు కట్టికొనియెదవా? ఏదీ. కానిమ్ము ముందేనాఁడో కాఁదగిన నీకులనాశనం బీక్షణమున నానుండి కానిమ్ము.

రావణుఁడు —ఓసీ ! జగరాగా స్త్రీహత్యయను దోషమ్ము వెలిబొమ్మ గానిలిపి నానుండి తప్పించుకొని పోఁజూచెదవా. ఏదోషములకు నే వెఱవను. ఇదిగో నిన్ను సంహరించెదను. (అనుచు లేవంబోవ మండోదరి యడ్డుపడి.)

మండోదరి.—నాథా. సైఁపుము సైఁపుము.

చ. అగణితధర్మకర్మ సుగుణాత్ముఁడైన పులస్త్యవంశమం
దగరుణసౌరభమ్ముగతి నందితి జన్మమునీవు; కావునన్
దగునెటునీకు స్త్రీవధ ; హితంబె విమంబునుగ్రోల, నన్నవే
మగతనమిందు లేదుగద ; మానినిఁ ద్రుంపఁగనేల మా నృపా.

ప్రాణనాథా, నీవు పులస్త్యబ్రహ్మ మనమఁడవు. విశ్రవసుని యాత్మజుఁడవు. వేదవిద్యా ప్రతిస్నాతుండవు. నీతి విదుఁడవు. ధర్మాధర్మకర్మల మర్మములుదెలిసిన వాఁడవు. అనేకశతవత్సరంబులు ఘోరతపం బొనరించి పరమేష్ఠివరంబందితివి. అవధ్యుఁడ వైతివి. రజితగిరియెత్తి గిరీశునివరంబంది చంద్రహాసము నార్జించితివి. సమస్త దిక్పాలురు నీ నామము విననతోడనె గడగడవడఁకుచు నీచరణసేవకు లగుదురు. ఇట్టి నీపరాక్రమమునబలపైఁ జూపనగునా. అది నీ కీర్తిచంద్రికఁబాపు నీలమేఘముగును గదా. వలదీ స్త్రీహత్య. ఊరుగువ తెగించినది. ప్రాణముపై నాశవదలినది. దీని జోలికి నీవు పోక యితరవిధముగ నిదిమడియు లాగొనరింపుము.

అనుబంధము 11.

రావణుఁడు.—ప్రేయసీ ! నిజము. అటులనే చేసెదఁ. మంత్రినిఁజూచి, అమాత్యవరా ఈ స్త్రీనిఁ గొనిపోయి భద్రముగు నొకమందసమున నుంచి తలుపుమూసి, పర్వతముపైనుండి సముద్రములోఁ బడఁద్రోయింపుము.

మంత్రి.—మహాప్రభూ ! అటులొనరించెద.

(నిష్క్రమణము.)

తృతీయరంగము.

రాక్షసులు.—(రాక్షసులు పెట్టెనెత్తుకొని కొండమీదనుండి పెట్టెను సముద్రములోఁ బడఁద్రోయుదురు. పెట్టె సముద్రమునందుఁ దేలుచుఁ బోవుచుండును.)

(నిష్క్రమణము)

చతుర్థరంగము.

(జనకమహారాజు-బ్రాహ్మణులు-సీత-బాలికలు.)

ఋషి.—జనకభూపాలా! మనమనుకొనిన మంగళముహూర్తము సమీపించెను. యాగప్రదేశమును మంత్రపూత మొనరించిన పిదప బాలికలు దున్ననగును.

జనక.—గురువరా! అటులనే కానిండు. శుభావహసూచకశకునములగు చున్నవి. కావున నిపుడే కర్తవ్యకార్యంబు సలుపుము.

(బ్రాహ్మణులందఱు వేద మంత్రములతో స్థలశుద్ధిఁ గావింతురు.)

పురోహితుఁడు.—ఎవరురా! వెలుపల ఇఁక యజ్ఞవాటిక దున్నఁదగిన నాగేలుఁదెచ్చి యిచ్చట లిఖింపఁబడిన రేఖల మధ్యప్రదేశము చక్కఁగ దున్నవలయును సుమా.

బాలికుఁడు.—మంచిదిస్వామీ! ఈస్వల్పప్రదేశము దున్నుటెంతపని. ఒకచాలుకే మాకాలులోఁతు దిగునటుల దున్నెదము.

(అనుచు ఓరివెంకటీ, ఓరికొండీ, ఓరిమల్లీ యని యఱచును. వారువత్తురు.)

ఓరి! ఈతలము దున్నవలెనఁట మనరాజుగారు చేయించియిచ్చిన బంగారు నాగలితో దున్నవలెనఁటరా?

పురో.—ఓరి! బాలికా! ఎద్దులను గట్టఁగూడదు. మనుష్యులే దున్నవలయును సుమా.

బాలిక.—అయ్యా! అవిద్య మనకు రాదు.

పురో.—హాలికా ! ఇచట జనకరాజుగారు యాగమొనర్తురు. ఆ స్థలము మలినపదార్థములెవ్వియు లేనటుల శోధింపవలెను. కావున నెమ్మదిగ మీరే నాగలి యాడ్పుఁడి.

హాలిక.—జనకరాజుగారు జన్నము సేయుదురా అటులయిన నేనే నాగలినిఁ బట్టెద. నాకొడుకు లిడ్చెదరు.

(అనుచు నాగలిదెచ్చి దున్నుచుండ నాగలి యొకచోటఁ జిక్కుకొని యెంత యుగ్గినను ముందటికి జరుగక యుండ, హాలికుఁడు గుద్దాలముఁ దీసికొనును.)

పురో.—ఏమిరా! హాలికా! గుద్దాలముఁ దీసికొంటివి.

హాలి.—స్వామీ! నాగేలు చిక్కుకొన్నది. కావున నాతలమును గుద్దలితోఁద్రవ్వెద.

(అనుచుఁ ద్రవ్వును.)

(ఆశ్చర్యపుపడి) స్వాములవారూ! ఇచట నొకపెద్దపెట్టె యున్నది ఆ పెట్టెకు నాగేలుకొనములికి చిక్కినది. రాదు.

పురో.—(జనకునిఁజూచి) భూమిపాలా ! ఇది యేమియచ్చెరువు. ఈనదీతీరప్రదేశమున మందస మెచ్చటనుండి వచ్చియుండును? బంగారు మందసంబుగ నున్నది.

జనక.—బ్రాహ్మణోత్తమా ! ఇది సముద్రముపైఁ బోవ నావపగిలియందుండు మందసము కొట్టుకొనివచ్చి ప్రవాహ మూలకమున నీనది చేరి ప్రవాహము దిగిన తోడనె యిసుకలోఁ జిక్కుకొనినది కాఁబోలు. మనహాలికు లాప్రదేశముఁ జక్కఁగఁ ద్రవ్వి మందసము నెత్తనిమ్ము.

పురో.—మనహాలికులాపనియందే శ్రద్ధాపరులై యున్నవారు.

(హాలికులు త్రవ్వి మందసము పైకెత్తుచు.)

హాలి.—అబ్బ! ఈపెట్టె రాక్షసులెత్తఁదగినదికాని మనుష్యులెత్తఁదగినది కాదు.

జనక.—బ్రాహ్మణోత్తమా ! ఈమందసము మూఁతఁదీయింపుము.

బ్రాహ్మ.—(మూఁత కష్టపడి తీయును)

అబ్బా! ఈమందసంబున మనోహరమైన మానినీవిగ్రహ మున్నది.

జనక.—(సమీపించి చూచి) ఈవిగ్రహము నాపాలి భాగ్యదేవతగ నగపడుచున్నది. (స్పర్శించి) హా! హా! చేతన్యమున్నది. బ్రాహ్మణోత్తమా! మంత్రపూతము గు శైత్యజలంబు నించుక ప్రోక్షింపుము.

బ్రాహ్మ.—(మంత్రముపఠించుచు నీరు ప్రోక్షించుచు.)

సీత.— (నిలిచి.)

వృ. నారాయణ హరినాగశయానా నాథునిగానిను నమ్మితిగా
నీరేజనయన నీరజనాభా నిత్యశుభావహ నమ్మితిగా
రారాములనిడి రాక్షసుఁడా నీరాకరముగా బడవైవఁగా
వారాన్నిధినను గాచుచుఁబారాఁవారముఁజేర్చెనుహాయిగగా.

ఆకాశవాణి.—(పైనుండి) జనకభూమిపాలా! నీయదృష్టవశమున నీకు లభ్యమైన నీపూర్వజన్మ సుకృతఫలంబిది. ఈకన్య రమాంశ సంజనిత. త్రిలోక రక్షణార్థంబీభువినిఁ బుట్టినది. నీగారాబుల బిడ్డగ దీని రక్షింపుము. సీతయని నామంబిడుము.

జనక.—(ఆకాశవాణికిఁగేలుమోడ్చి సీతను పూజించును.)

బ్రాహ్మణోత్తములారా! నాకయిన శుభశకునములకు సిద్ధికఁగ నాపాలి భాగ్యలక్ష్మి నాకు లభించెను. మంగళనాదములతోఁ బురిఁ జేరుదము.

(ఉత్సవనాదముల వేడుకలతో బురంబునకు వెళ్లుదురు.)

పంచమరంగము.

(జనకమహారాజాస్థానము - సుబుద్ధి - నారదుఁడు.)

చ. మదికి ముదావహంబయె నమాత్యవరా; మనసీత, నిన్న స
మ్మదమున నీశుచాపమును మానుగగుఱ్ఱము చేసియెక్కి, శా
రద శిఖనెక్కు-రీతిని సరాళముగా విహరించుచుండ, నే
నదిగన నబ్బురంబయె నహో; యిదియేమి విచిత్రమో కదా.

అమాత్యవరా! శతాయుతగజసత్త్వమైన నెత్తఁజాలని యీశ్వరచాపంబు మనజానికి నవలీలఁగ నెత్తి దానిని గుజ్జుమును జేసికొని యెక్కి పసిపిల్లలవలె సంచరించుచున్నది. ఇంతటిశక్తి యబలకు నెటులకల్గెనో యని యచ్చెరువందుచున్నాను.

(నారదుని ప్రవేశము.)

అనుబంధము 12.

వృ. నతపరిపోషణ, పతితవిమోక్షణ, నుతగుణభూషణ, మాధవా
హితకలభాషణ, యతిజనరక్షణ, దితికులశోషణ మాధవా
గతజనదూషణ తతరణభీషణ యతిశుభవేషణ మాధవా
శ్రుతిహితరక్షణ శ్రితజనతోషణ శతమఖపోషణ మాధవా.

జనక.—(నారదులకు నమస్కరించి.)

గీ. కలుషగహనదహన కాంచనోదరసూన
మునిజనాభిగేయ ముదితహృదయ
సతతసుజన సంగసంయమీంద్ర పతంగ
చరణ సేవకుఁడను జనక విభుఁడ.

నారదా! విమలవిజ్ఞానవిద్యాప్రమోదా! నిఖిలామరసంసేవ్యములగు తమ పాదములకు నభివందనంబు లాచరించెద.

నారద.—జనకభూమిపాలా! రాజయోగవిద్యావిశాలా! నీ నయవినయంబులకు మది మెచ్చితి. భూపాలాగ్రణీ! ఏమో ఆశ్చర్యాధీనమానసుఁడవైనరీతి నీ ముఖము సూచించుచున్నది. ఏమియది.

జనక.—సంయమిచంద్రమా! సకలప్రాపంచికచర్యలు దివ్యవీక్షణముల వీక్షించు తమకు సర్వము కరతలామలకంబుగ నుండును కదా. అయినను దాసుని చిత్తశుద్ధిఁ బరీక్షింప నన్నుఁ బ్రశ్నించెదరు కావున యథార్థంబు విన్నవించెద. నే నొకయాగంబు సలుప సమకట్టి యజ్ఞవాటికాతలంబు శోధించి శుద్ధిఁబ అప నాగేటితో దున్నించుచుంటిని. నాగేటికొన భూమిలో చిక్కుకొని వెలివడకుండిన కారణంబున నత్తలముఁ ద్రవ్వింప నందు నొకమందసంబు దొరికెను. దానిఁ దెఱచిచూడ నందొక దివ్యమానినీ విగ్రహ మగపడెను. అకా—

లంబున నాదివ్యమానిని రమాంశసంజనితయని యాకాశవాణి యనియెను. ఆ మగువను నా గారాబుకూఁతురుబలె నేఁ బోషించుచున్నాను. నాయింటి వంశక్రమముగఁ బూజింపఁబడుచుండు శివధనుస్సు నితరగజాయుత సత్త్వులెత్తినను లేవకయుండెను. అట్టి చాపమును, సీత, నిన్నటిదినంబున నవలీలఁగ నెత్తి దానిని గుఱ్ఱముసలిపి పైననెక్కికొని సంచరించుచుండెను. దానింగని యబ్బురపడితిని. ఇదియ నాయాశ్చర్యకారణము.

(నారదుఁడించుక యోచించి.)

నారద.—జనకభూపాలా! సకలము నాదివ్యలోచనముల వీక్షించితి.

జననాథా! సకలలోకశరణ్యుఁడగు నారాయణుఁడా విష్ణువర్ధన రాజునకిచ్చిన వచనము పరిపాలించుటకై మానవజన్మమెత్తి విష్ణువర్ధనకు మునులవలనఁగలిగినశాపము తాననుభవించుచున్నాడు. రమాంశసంజనితయగు వేదవతి పూర్వజన్మంబున నారాయణుఁడే తన పతి కావలెనని ఘోరతపంబొనరించి త్రిలోకకంటకుఁడగు రావణుని దుడుకునకు వెఱచి యగ్నిప్రవేశముయి మరలఁ గారణాంతరమున మునుల శాపమున మానవజన్మమెత్తి సీతగఁబడినది. నీపాలిభాగ్యలక్ష్మి, యా మానినీమణి నీయింటనుండు శివధనస్సు నెవఁడెత్తి గుణమెక్కించి దానిని విఱచునో యాపరాక్రమశాలికి నామాని నీ మణి ఆరమాంశసంజనితయగు సతి వీర్యశుల్కగ నెగడును. దీనినుండి క్షేమమగును. జనకభూపాలా నేను పోయివచ్చెద.

జనక.—మునికులపతంగా! వందనములాచరించెద.

నారద—దీర్ఘాయురారోగ్య సౌభాగ్యమస్తు.

(నారదనిష్క్రమణము.)

జనక.—అమాత్యపుంగవా! నారదులయానతిరీతి సీత వీర్యశుల్కయనియును నా యింటనుండు చంద్రశేఖరు చాపమెక్కిడి విఱచు వీరాధివీరునకు దారగ జానకి లభ్యమగుననియును సకల దేశాధీశులకు లేఖలు లిఖింపుము. దశాననకుమాత్రము వలదు.

మంత్రి.—తమయానతి శిరసావహించి యొనరించెద.

(నిష్క్రమణము.)

శ్రీ

సీతాకల్యాణము.

ద్వితీయాంకము—ప్రథమరంగము.

దశరథునియాస్థానము.

[దశరథుఁడు, వసిష్ఠులు, సుమంత్రుఁడు, విశ్వామిత్రుఁడు, రామలక్ష్మణులు.]

దశరథుఁడు.—(వసిష్ఠులఁజూచి.)

కం. గురువర్య! తమయనుగ్రహ
మరయుచు మత్సుతులు గఱచిరఖిలాగమముల్
శరవిద్యయు, నిఁక మంత్ర
స్ఫురితంబగు నస్త్రవిద్యఁ బొందవగుఁగదా.

భూరితపోధనా! వసిష్ఠా తావకీనకృపాతిరేకంబున నాపుత్త్రులు నిఖిలాగమ వేత్తలయిరి. విలువిద్యనంతయు గఱచిరి. ఇఁక మంత్రపూతంబగు నస్త్రవిద్య వారు గఱచుట ముఖ్యముగ నున్నది.

(ఫణిహారియొకఁడువచ్చి.)

ఫణిహారి.—దశరథభూమిపాలా! తేజోలసితుండును, మహాతపశ్శీలుఁడునగు విశ్వామిత్రులవారు వచ్చి ద్వారంబునఁ గాచినారు.

దశ.—హా! హా! విశ్వామిత్రులవారు వచ్చి వేఁచియున్నవారా. నేఁ బోయి పిలిచికొనివచ్చెద. (అనుచుఁ బిలిచికొనివచ్చి యాసనమునఁ గూర్చుండబెట్టి నమస్కరించి.)

మ. అమరేశాది దిగీశపూజితములై, యానంద తేజమ్ములై
సుమనోభీష్టద పారిజాతములునై శోభిల్లు మీపాద, కం
జములన్, మానునియుత్తమాంగమను బ్రాంచద్భృంగముల్ సర్వకా
లములన్ రంజిలఁ జేయుమా మునివరా, లాలింపుమా సేవకున్.

తాపసోత్తమా! ధన్యుండనైతిని. జరావ్యాధి సంకలిత శరీరధారులకమృత కలశంబు దొరకినటుల, నిర్ధనులకమితధనంబు దొరకినటుల మీరాక నాకులభించెను. మహానుభావా! నాహృదయమందత్యాయత ప్రమోద లాభంబందినటుల నేఁడెలిసెద. దైవికంబున సమకూరిన తమరాకచే నా పాపజాలంబులన్నియును బటాపంచలై పారెను. ఘోరసంసారార్ణవంబున మునింగిన మాదృశనరపాలమండలము నుద్ధరింప యుష్మదీయ కృపాపోతమొకటి తప్ప వేఱుసదుపాయంబు గలుగునా? సుపవిత్రమై శుభంకరమై మించు మీదర్శనంబున నాజన్మంబు సార్థకతఁజెందె. నా పూర్వభవార్జిత పుణ్యంబు ఫలించె నయ్యెల. సాధు భూపతులలో నగ్రగణ్యుండనైతిని. మునిచంద్రమా! ఏమిదలంచి తాము వేంచేసితిరో తెలియకున్నాను. సేవకుని పవిత్రునిఁ జేయుటకుఁగాఁబోలు.

విశ్వా.—దశరథా! అసమాన గురూపదేశ సంజనితలసద్వివేకుఁడవు. సాధులోకస్తుత్యుఁడవు. అన్వయోచిత నయవినయాంచిత ధురీణుఁడవు. కావుననే, నీవిపగిదిఁ బలుకుట సముంజసానురూపముగ నున్నది.

దశరథ.—మునిలోకపుంగవా! తమకై నాచేఁగర్తవ్యంబగు కార్యంబేదియైన నున్న మీపదదాసుఁడగు నేను దానిని నిర్వహించి మీయనుగ్రహమునకుఁ బాత్రుఁడనయ్యెద

విశ్వా—భూమిపాలా! రవికులజులిట్టి సుగుణసమృద్ధులు కావుననే యీ కులంబకళంకంబుగ భాసిల్లుచున్నది. ఇందులకు నిదర్శనము సత్యహరిశ్చంద్రదేతిహాసమొక్కటియ చాలును. దశరథమేదినీధవా? నా రాకకుఁ గారణంబుఁ దెలిపెదను వినుము.

చం. నృపవర యేమిదెల్పుదును నీవు వసుంధర నేలుచుండ నే
యపకృతి మాకుఁగల్గదని యాగమునొక్కటి సేయుచుండఁ దో
రపుసురవైరు లొక్కమయి రౌద్రమునన్ జెడఁగొట్టుచుండనా
తపమునకున్ గొఱంతయని దానవులన్ శపియింపనోడదన్.

నృపాలా! నేను యాగదీక్షఁ గైకొని యథావిధి హోమము సేయుచుండఁగా మహామాయావిచక్షణులును సుందోపసుందుల పుత్రులునగు మారీచసుబాహులను వారు నాపైఁ బొల్లు రువ్వుచు నగ్నులపై మాంసమూత్రపురీషాదులు వర్షించి యపవిత్రంబులు సేయుచు విఘ్నములాచరించుచున్నవారు. వారిదురాచారంబులు దుస్సహ్యంబులు, కావున నాపాపాత్ముని రూపుమాపఁ జేయఁ గుమారసమాన పరాక్రమశాలియగు నీకుమారుని రాముని నావెంటఁ బంపుము.

దశరథ —(నిట్టూర్పు సారించుచు నిశ్చంచలతఁ గూర్చుండును.)

విశ్వా —ఏమి దశరథా! ఆటుల మౌనమూని కూర్చుంటివి?

దశరథ —మునికులావతంసా!

ఉ. నిన్ననె కన్నువిచ్చె, నెటు నేఁడు బలాన్వితులౌ సురారులన్
జెన్నుఱఁ జేయువాఁడిది విచిత్రము లోకమునందుఁ గానమో.
సన్నుతసంయమీంద్ర! సహజమ్మగు నే యిది యెన్నఁడేనియున్
చిన్నెలచిన్నవాఁడు నను జెక్కులఁ బాల్వెద చల్లువాఁడరో.

మునికులాగ్రణీ. నాకుమారుఁడు రాజీవదళలోచనుఁడు. భూరికర్కశభుజశక్తి వానికిఁ గానరాదు. ఘోరువారు రాత్రించరులు బలాబలయుక్తులెఱింగిన మాయావిచక్షణులు నాబాలుఁడకృతాస్త్రుఁడు యుద్ధావని నెన్నఁడేనిఁ జూచియెఱుంగఁడు. ఊనషోడశవర్షుండగు బాలుఁడెటు పటువిక్రమాఢ్యులగు రాక్షసుల నెదుర్పఁగలఁడు. నిన్నమొన్నటి చిన్నకుఱ్ఱయగు రాఘవుఁడేడ! రాక్షసులేడ? మునికులసార్వభౌమా. పెద్దకాలంబు సుతులన్గానక భవాదృశయతీంద్రుల యాశీర్వచనోన్నతిచేఁ బుత్రుల మోముఁ జూచితిని. సంయమిచంద్రమా! మద్భాగ్యంబు మదీయవంశకర్తయగు భవదధీనంబుకదా. ఆతలిరుప్రాయఁపు ముద్దులకుఱ్ఱను బంపుటకంటెను నేనే చతురంగబలసమన్వితుఁడనయి వచ్చి రాక్షసుల భంజించి యజ్ఞముఁ గాపాడెదను.

విశ్వా.—భూమిపాలా! ఆ రాక్షసులు నీచే జితులగువారు కారు. పులస్త్యబ్రహ్మనందనుండగు విశ్రవుని కుమారుఁడు రావణుఁడుండునుకదా? వాఁడు విధిదత్తవరజాతమదంబున మత్తుఁడై వీర్యగర్వంబున మదించిన దుష్టనిశాటులం జేర్చికొని, వారిం బంపి క్రతుకర్మంబులు చెడఁగొట్టుచుండును. దిక్పాలుర శిక్షించుచుండును. ఇటులఁ ద్రిలోకకంటకుండయి భాసిల్లుచున్నవాఁడు. వాని బంధు

వర్గములోఁజేరి వానికంటెను హెచ్చుమాయలన్ నేర్చి మారీచసుబాహులను వారు మానుల నేఁచుచుందురు. అట్టివారిని రూపుమాప నీకొమారుఁడు రాముఁడు సమర్థుఁడగునుగాని మఱియేరికి సాధ్యపడదు.

దశరథ.—మునికులాగ్రణీ! నాకు భయమయ్యెడు. మనజులము మేము మనుజాశను లగు రాక్షసుల నెదురుట బక్క నక్క సింగము నెదిరించుటయకదా? దేవస్వరూపులగు నష్టదిక్పాలురను జయించిన దానవులను మానవులెవరించుట కొండను మేషము ఢీకొనుటయగదా? మహానుభావా! ఎటులయినను నాముద్దుల సుతుని రాముని వదలి నన్నుఁ బ్రసాదింపుము. నీపాదారవిందములంబడి నమస్కరించుచు సదామిమ్ము స్మరించుచుండెదను. (అనుచుఁ గాళ్లపైఁ బడును)

విశ్వామిత్ర.—(కోపమునఁదన్ని) ఓరీ సూర్యవంశకులనాశకా. మృషావాదీ. ఉన్మత్తా.

అనుబంధము 13.

క. అడిగినపని సలుపుదునని
వడిగా వచనంబునిడుచు వాచంయములన్
గడుసరివై వంచించెదు
చెడుగా! నీమోముఁ జూడఁ జెడుగగు మాకున్,

ఛీ; ఉన్మాదా. వచనభ్రష్టా నీ పాడుమోముఁ జూడనొప. నేఁ బోయెద. (వెళ్లుచుండును.)

వసిష్ఠ.—(అడ్డుపడి విశ్వామిత్రులనిలిపి) విశ్వామిత్రా. ఇంచుక యుపశమింపుము. పుత్రవాత్సల్యమునఁ బుదమిపాలుఁడు రాము నెడఁబాయఁజాలక యున్నవాడు (దశరథునిఁజూచి) ధశరథా. రవివంశదీపకా. ఇదియేమి, యింతటివిమోహంబులోఁ బడితివి? ఈవిశ్వామిత్రులవారి ప్రభావంబు నీవు దెలియవా? తెలిసియు మఱచితివియా? పూర్వమఖండచండనిష్ఠామహిమంబున ఘోరతపంబొనర్చి యోగవిద్యామహిమాధికుఁడైనవాఁడు. ఉగ్రతపంబు సలిపి యుగ్రుని మెప్పించి నిశాతసాయకములనేకములు వరముగఁ బడసినవాఁడు త్రిలోకంబునన్ గల దారుణాస్త్రసంచయసంహారోపసంహారమర్మము లెఱింగినవాఁడు. ఇమ్మునీం

క్రమనహీనమహత్త్వంబు లెఱుంగ ధాతనైనను వశమగునే? ఈ సంయమీంద్రర క్షితుఁడయి నీ సుతుఁడుండుతఱి రాక్షసులు వాని వీక్షింపనైనఁ జాలరు. దారుణానలగుప్తమగు నమృతంబును బోలె నీపుత్రుఁడు వెలయుచుండును. కావున నీపుత్రుని రాముని, వానివెంట సుమిత్రానందనుని లక్ష్మణునిఁ బంపుము. చింతింపకుము. భయపడకుము.

దశరథ.—(ఇంచుక యాలోచించి విశ్వామిత్రునిఁ జూచి) గురూత్తమా; పుత్రవాత్సల్యంబను విమోహపాశంబునఁ గట్టఁబడిమీ యహీనతపోమహిమఁ దెలియఁజాలక యుంటిని. ఇపుడీ జ్ఞానవృద్ధులగు వసిష్ఠులవారిచే బోధింపఁబడి యజ్ఞానజనితమూఢత్వంబు వదలితి. నాపుత్రులన నెవరు? తమవంశాంకురములే కదా. మీకు లేనిమమత వారిపై నాకుఁగలదా? నాపుత్రులు నలువురిలో రామలక్ష్మణులిరువురినిఁ దమవెంటఁ బంపెద. రక్షించుభారము మీయది.

అనుబంధము 14.

విశ్వా.—కం. బాలుండని వెఱవకు భూ
పాలా నీసుతుఁడు దైత్యవంశాంతకుఁడై
భూలోకము నిర్భీతిగఁ
బాలించును; నిజము, పరమపావనమతిరాయా.

దశరథ.—మునికులాగ్రణీ! నేఁడు దాసుఁడొసఁగు సపర్యలనంది ప్రాతఃకాలంబుననే ప్రయాణంబు సలుపనగు.

విశ్వా.—అటులనే కానిమ్ము.

దశరథ.—రండు! మనమందిరమ్ము లోనికి వెడలుదము.

(నిష్క్రమింతురు.)

ద్వితీయరంగము.

అరణ్యము.

[విశ్వామిత్రులు - రామలక్ష్మణులు - తాటక.]

విశ్వామిత్రుఁడు.—రామభద్రా! ఈ సరయూనదీతీర దక్షిణప్రదేశంబుఁ జేరవచ్చితిమి ఇఁక మనము ఘోరారణ్యములమార్గముగ నాయాశ్రమంబునకుఁ బోవలయును. ఈదుర్గమాటవిని మార్గనిరోధకులై నిశాటు లనేకులు మము బాధించుచుందురు. కావున నీ విపుడు శస్త్రాస్త్రబల సంపన్నుఁడవగుట యావశ్యకము.

ఉ. ధీరగుణాభిరామ ఘనధీవర యీసరయూ మహానదీ
తీరముఁ జేరవచ్చితిమి తీవ్రగతిన్ జలమందుస్నాతలై
భూరిశుచిత్వమందుచును బూతమతిన్ ననుఁజేరరండు మీ
కారయఁగా బలాతిబలలంచను మంత్రములెల్లఁ జెప్పెదన్.

రామలక్ష్మణులారా! మీరుస్నాతలై శుచిర్భూతులరై శుద్ధచిత్తతననుఁ జేరుఁడి మీకు బలాతిబలలనుమంత్రము లుపదేశించెద. అమంత్ర మహిమంబున మీరు వీర్యతేజస్సమన్వితులును సర్వజ్ఞాన ప్రదీపకులును నగుచు వెలయుదురు.

రాముఁడు.—గురూత్తమా! తమయానతిశిరసావహించి చేయుదుము.

(వెళ్లుదురు.)

అనుబంధము 15.

విశ్వామిత్ర.—ఈనాశిష్యులు పరమవిధేయులు! శుద్ధచేతస్కులు. పటుపరాక్రమశాలురు. నిశాచర నాశనంబునకై దేవాంశసంభూతులై యీభువి జన్మించినారు. నా నేర్చిన బాణప్రయోగవిద్యయు నుగ్రతపంబానరించి నార్జించిన యస్త్రవిద్యామహిమయు నిట్టి శిష్యులకు నుపదేశింపక మఱియేరికి వినియోగింపనగును.

[రామలక్ష్మణులు శుచిర్భూతులై ప్రవేశింతురు.]

అనుబంధము 16.

రామలక్ష్మణులారా! సరసకురండి.

(రామలక్ష్మణులు వద్దకు వచ్చెదరు! వారిచెవిలో విశ్వామిత్రుఁడు మంత్రము లుపదేశించును.) మరల రామలక్ష్మణులంజూచి) రామలక్ష్మణులారా. మీమిూరుఁ

జూచినక్షణముననే నాకు మితిమించు కనికరముట్టిపడులాగున వెలివడుచున్నది కావుననే నతిప్రయాసమున నార్జించిన దివ్యాస్త్రములెల్ల మీవశపఱచెద.

(అనుచు నిమీలితాక్షుఁడై)

ఉ. పావనచిత్తశుద్ధిగ, నపారతపంబొనరించి యీశు సం
భావన మూలకంబుగను బ్రాప్తిలినట్టి భృశాశ్వసూనుతీ
భూవరసూను బ్రోలనతి పూజ్యతనిల్తురుగాత లోకసం
జీవనమూర్తులై జయవశీకృతులై రఘురాముఁ గొల్చుచున్.

(అనుచుఁ బ్రార్థింప దండచక్ర. ధర్మచక్ర, కాలచక్ర, విష్ణుచక్ర, యైంద్రాస్త్రశివశూల, బ్రహ్మశిర, బ్రహ్మాస్త్ర, కాలపాశ, వరుణపాశ, సంతాపాస్త్ర సమ్మోహనాస్త్ర, నారాయణాస్త్ర, ఈ పేరుగల బాలురాయాచిహ్నములతో సాక్షాత్కరించి విశ్వామిత్రునకు వందనంబులిడుదురు.)

విశ్వా—(వారింజూచి) ! సకలాయురారోగ్య సౌభాగ్యమస్తు ! (రామునిఁజూచి) రామభద్రా ! ఆదిత్యోరు తేజా ! శస్త్రాస్త్రరూపులగు నీబాలురిఁక నీయధీనులు సకల వేదవేదాంగ ధర్మనీతిప్రచారుఁడై రాక్షసవధార్థంబు ఘోరతపంబొనరించి దక్షకన్యలగు జయసుప్రభలనువారి నిరువురినిఁ బరిణయంబై శస్త్రాస్త్రరూపులగు వారిని వేవురిని గనెను. వారిలో వీరు ముఖ్యులు. నాతపంబునకు మెచ్చి రుద్రుఁడు వీరిని నాస్వాధీనపఱచెను. వీరిసాహాయ్యమున నీవిఁక నర సురఖేచర గరుడోరగ విద్యాధరాసుర వీరవరులెవరెదిరినను జయింతువు.

శ్రీరామ.—విశ్వామిత్రులకు మ్రొక్కును.

బాలురు.—(రాములనుఁ జూచి నమస్కరించి.

చ. నరులనెదుర్తుమో యసురనారుల మంగళకంఠసూత్రముల్
త్వరితగతిన్ హరింతుమొ, యువారిగ వారిధి నింకఁజేతుమో
ధరణినిఁ జీల్చివైతుమొ విధాతను గట్టుచుఁ బట్టితెత్తుమో
గురువర యాజ్ఞయిచ్చి పనిగొమ్మిఁక దాసులమైతిమీ యెడన్.

శ్రీరామ.—బాలకులారా ! మీరనినంతపని సెనర్పఁజాలు శక్తివంతులనుటకు సందియంబు లేదు. ఇప్పుడు మీరొనరింపఁదగిన పని యేమియు లేదు. మీరిప్పుడు స్వేచ్ఛగఁబోయి మిమ్ముస్మరించినప్పుడు నాకు నగపడి సాహాయ్యమొనర్పుఁడి.

అనుబంధము 17.

బాలకులు.—ఆజ్ఞ (అనుచు వందనంబిడి) (నిష్క్రమింతురు.)

విశ్వామిత్ర—రామభద్రా! భద్రముగ మనమిఁకఁ బ్రయాణమగుదము.

సీ. మున్నీటిలోఁ గల మునఁగుచు మీనమై
సోమకుఁ జీల్చిన స్వామి యితఁడు,
పాలమున్నీటఁ దాఁబేలయి సురలను
దయఁ జూచి కాచిన దైవమితఁడు,
భూమిఁ జాపఁగఁ జుట్టు హేమనేత్రుఁ బట్టి
ధరవరాహంబయి తనరెనితఁడు,
సుతుని బాధించిన దితిజునిఁ జీల్పఁగ
నల నృసింహాకృతి నరసె నితఁడు.

గీ. బలిని బంధించి వెలసిన బలియుఁ డితఁడు
రాజతేజము నార్పిన రాముఁ డితఁడు
ఇట్టి దైవము విలువిద్య యిచ్చయించి
శిష్యుఁడయె నాకు నెంతటి చిత్రమిద్ది

రాము—గురూత్తమా! అటులొనరింతము. (అనుచుఁ నడుచుచుండ లోనుండి గంభీరధ్వనియగును.)

స్వామీ! ఈ ఘోరఘోషణధ్వని యెవరిది?

విశ్వ—రఘువరా! ఇది తాటకయను దానవికంఠధ్వని.

రాము.—గురువరా! ఆ తాటక యెవరు!

విశ్వా.—ఆ తాటకి సుకేతుఁడను యక్షుని కూతురు. బ్రహ్మవరజనిత సహస్రమదావక సత్త్వము కలది. అది నిస్ఫురద్రూపిగనుండి సుందుఁడనువానికి భార్యగనుండి మారీచునిఁ గనినది. అగస్త్య శాపసంస్పృష్టయై వికారరూపంబంది సాధుజనుల హింసించుచున్నది. ఇంతలో మనపైఁ బడును. కావున నీకుఁ గల శబ్దవేదిత్వవిద్య నుపయోగింపుము. ఆ రాక్షసినిఁ జంపుము.

శ్రీరా.—గురువర్యా! తాటక స్త్రీ కదా! స్త్రీవధ ధర్మమేనా?

విశ్వా.—రామభద్రా! ఈతాటక దుష్టదురాత్మదురాధర్షిణి కావున గోబ్రాహ్మణహితార్థము దీనిఁ జంపినదోషంబు నీకురాదు.

శ్రీరా.—గురూత్తమా! ఎందైనను పెద్దలు స్త్రీని వధించిన నిదర్శనము లున్నవియా

విశ్వా.—దాశరథీ! మున్ను ధారణిని మ్రింగఁజూచిన విరోచననందనయగు మంథరను సురేంద్రుఁడు వజ్రాయుధమున నణఁకఁడా! మున్ను సురనాశనమునకును, నసురాభివృద్ధికిని ఘోరతపంబొనర్చు భృగుపత్నిని విష్ణువు తనచక్రమునఁ జంపఁడా? రఘురామా! స్త్రీవధయనెడి యనుమానము నీకు వలదు. ఇది శాపదూషిణి కావున దీనివధ నీకు శ్రేయోదాయకంబగును

శ్రీరా.— గురుసత్తమా! తమయాజ్ఞ శిరసావహించి చేసెద శబ్దవేదిబాణమొకటి చేనంది దానినిఁ బ్రయోగించును ఆశబ్దమువిని తాటకు ఘుడఘుడాయాముచుఁ బ్రవేశించును.

తాటక.—(ఆర్భటించుచు)

చక్కని రూపుఁగన్నారు
నిక్కుచు సొక్కియున్నారు
చిక్కని రక్తముఁ గారు
మెక్కనగ బట్టు నాసోరు.

(దారికి నడ్డము వచ్చును.)

శ్రీరాము.—వృ. నిలునిలు దానవి డాయకుమా
పలువలఁ బోలుచుఁ బలుకకుమా
కులమల నీవిటు మాడకుమా
చలములు హెచ్చఁగఁ గూయకుమా.

(అనుచు విల్లిందును.)

తాటకి.—వృ మానవ మాంసము గోరి
దానవి నేనిటుఁ జేరి
కానఁగ నైతిని పేరి
మేనున మ్రింగెదఁ బోరి.

(అనుచు సమీపించును.)

శ్రీరాములు.—కృ. కూయక విడుమా దారీ
డాయకు డాయకూ మీరీ
పోయక నిల్చినా గోరీ
సాయక ముంపెదనా నారీ

(అనుచు బాణమువేయఁ దాటక నేలఁగూలును.)

విశ్వా.—(రాముని కౌఁగలించుకొని.)

చ. ఇఁక వికసించు రాఘవ మునీశులహృత్కమలంబు లెందునన్
సకలజనాళి, యిజ్జగతి సంతసమందుచు నుండుఁగాదె, తా
టకవధ లోకమోదమగుటన్ గద, చూడుమ దేవకోటి త
త్తకతక దింధిమిధ్వనులఁ దాండవమాడెడి మింటిపైఁ గడున్.

రామా! సుగుణాభిరామా రాక్షసవిరామా ఈ మలదకరూశ ప్రదేశంబులిఁక ఫలప్రదములై సుఖితములై యుండును. మనము వైళమ్మె ప్రయాణమై మనయాశ్రమంబుఁ జేరుదము.

శ్రీరాములు.—గురువరా! తమ యానతి రీతిగానిమ్ము.

(నిష్క్రమింతురు.)

తృతీయరంగము.

సిద్ధాశ్రమము

(విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులు మునిశిష్యులు మారీచసుబాహులు.)

విశ్వా.—(రామలక్ష్మణులఁజూచి) బాలకులారా! నాదేయంబగునీన షడ్దినయాగంబు నేఁటనుపక్రమించెద. ఆ యాఱుదినంబులు నేను మౌనవ్రతము సలిపెద. మీరటు నిశాచరులబాఱినుండి యీ యజ్ఞంబు సమాప్తినొందింపఁ జేయుఁడరో యది మీకుఁగలసిన భారము. రాక్షసులు నిశాచరులుగావున నక్కాలంబున

వారికమితబలంబు ప్రాప్తిల్లు. మఱియవారు మాయావశులు కావున మీరు నేమఱిచి తమపనిని సాధించుకొందురు. మీరన్ని విషయముల సర్వకాలముల జాగరూకులై యుండవలెను.

శ్రీరాము —(విశ్వామిత్రులకు మ్రొక్కి.)

చ. తపసివరాగ్రణీ తవకపదంబుల నెల్లెడ సంస్మరించుచున్
విపులశరాస్త్రశస్త్రవిధివేత్తలమై పొలుపొందు దోర్బలం
బపరిమితంబుగాఁగను దు నారయ దుష్టనిశాటకోటినిన్
యపనుతులన్ వధింపమెటు లాజిని: బెద్దలనుగ్రహించినన్.

విశ్వామిత్రుఁడు — రామచంద్రా! నీవినయసంపదకు నే మదిమెచ్చితి. రవికులంబునకు వన్నెఁదెచ్చు యశంబు నీవార్జింపఁగలవు. ఇపుడు నేఁ బోయి యాగమునకుపక్రమించెద

(ఆశ్రమములోనికి వెళ్లును. మంత్రములు వినఁబడుచుండును. రామలక్ష్మణులు చాపహస్తులై యాశ్రమద్వారంబున నిలిచియుందురు. అకాలము చీకటులుగప్పికొని మేఘధ్వనులు బలముగనగును. మునికుమారులు హోమకుండమున రక్తముపడె నని యఱతురు.)

రాముఁడు — లక్ష్మణా! రాక్షసుల మాయాబలము. ఎంతచీకటి గప్పెను. అకాల మేఘాచ్ఛాదన యపరిమితంబయ్యె. మేమలసులమైనఁ గార్యంబు చెడును. ఇదిగో పవనాస్త్రప్రయోగంబున మేఘములనుఁ బటాపంచలుగఁ బాఱఁదోలి ఆగ్నేయాస్త్రమున వెలుతురు గలిగించి యామాయావి యెచటనుండు నది వీక్షించి వానిఁజంపెద.

అనుబంధము 18.

(అనుచు బాణములు మంత్రించి ప్రయోగించును.)

లక్ష్మణా చూచితివియా! ఆకాశమార్గమున నగపడు రాక్షసు లిరువురిలో నొకఁడు మద్బాణహతిఁ గొట్టికొని పోవుచున్నాడు. అగిగో చూడుము సముద్రమధ్యమునఁ బడెను రెండవరాక్షసుఁడదిగో నుండి క్రిందఁబడుచున్నాఁడు, మనగురువుల

వారనిన మారీచసుబాహులనువారు వీరే కాఁబోలు? కుటిలమెవరేవిధమున యజ్ఞవిఘ్న కారులగుదురో చూచెద. జాగరూకతఁ గలిగియుండుము.

(నిష్క్రమించును.)

చతుర్థరంగము.

సిద్ధాశ్రమము

(విశ్వామిత్రుఁడు. రామలక్ష్మణులు బ్రాహ్మణుఁడు.)

అనుబంధము 19.

విశ్వామి.—(రాముఁజూచి) రామా నేఁటికి నాపూనినయాగంబు నీనుండి నిర్విఘ్నముగ సమాప్తినందెను. నీవెంతటి దేవాంశసంభవుఁడైనను నాశిష్యులతోఁ జేరినమానవుఁడుగ నుండుకారణంబున నిన్ను హెచ్చుగ నుతింప ధర్మము కాదు.

మ. రవివంశాభరణా నతార్తిహరణా రామా నినున్ నేను సం
స్తవనంబున్ సలుపంగరాదుగద నీశౌర్యంబు వాచంయమీ
భవులన్ రక్షణ సేయుకార్యమున సంభావ్యంబుగాఁ బెంపుమా
దివిజానీకుల సేమమెల్లెడల హృద్వీధిన్ విచారింపుమా.

రామభద్రా. నీకు నేఁగఱపిన శస్త్రాస్త్రవిద్యలు, మునుఁబోలు సాధులఁ సంరక్షణార్థము వినియోగింపుము ఇంద్రాది దిక్పాలురక్షేమము సదాకాలము విచారించుచుండుము.

శ్రీరా.—గురువరా! నేనెంత, నాకార్యమననెంత సర్వముఁ దమయాశీర్వాదఫలముగాదా?

క. నిజముపేదకు ధనమచ్చిన
కరణిన్, దమచరణసేవకలిగిన కతనన్
గురుతర సంపత్కరమగు
శరవిద్య లభించె నాకు సంయమిచంద్రా.

గురూత్తమా. తాము నాకిడిన విద్యాధనంబునకు మాఱు తమకై నేనెంతపని యొనరించిన నదితక్కువయని నాకుఁ దోఁచినది కావున నాశరీరమే తమ యాధీన పఱచితిని.

(బ్రాహ్మణుని ప్రవేశము.

బ్రాహ్మ—(విశ్వామిత్రునకు నమస్కరించెను. రామలక్ష్మణులు బ్రాహ్మణునకు నమస్కరింతురు.)

విశ్వా—బ్రాహ్మణోత్తమా తమదేరాష్ట్రము? ఏకార్యంబునకై తమరిచటికి వేంచేసితిరి.

బ్రాహ్మ.—మునికులసార్వభౌమా! నాది మిథిలానగరము. మా రాజు జనకుఁడు తమ కొక విజ్ఞప్తివ్రాయించి తమకందింప నన్నుఁబంపెను.

(అనుచు జాబిచ్చును.)

విశ్వా.—(జాబునందికొని రాములఁజూచి) రామభద్రా. ఈజాబు చదువుము.

శ్రీరా—భవదాజ్ఞ (జాబంది.)

సీ. మనికులసార్వభౌ ములకువందనమిడి
జనకుఁడు జేయు విజ్ఞప్తి, దేవ
వైశాఖసితపక్ష పంచమీ గురువార
మునను నేనొకయాగ మును సలుపఁగఁ,
దలఁచితిఁగావున దయజేసి వచ్చిమీ
పదదానుగృహము పా వనముఁ జేయఁ,
వేఁడితిమతియొక విజ్ఞప్తి యేమన
నాభాగ్యలబ్ధమా నందనికిని,
యాగాంతమందుస్వ యంవరోత్సవమును
సలుపయత్నించితి శర్వచాప.
ఖండనమె వీరశుల్కము గాఁగనుంచి
కాన మిముఁబోలు ఘనుల సత్కరుణ నొదనఁ

గోరి వ్రాసితి నీలేఖఁ గోర్కె మీఱ
వేయిపనులున్న వదలి రా-వేఁడువాఁడ.

జనకుఁడు.

విశ్వా.—రామచంద్రా! ఈజనకమహారాజు మహాపుణ్యపురుషుఁడు రాజయోగి. అనేక యాగంబులాచరించిన ధన్యుఁడు. ఇట్టి పుణ్యపురుషుని దర్శనంబున మీ కపరిమితమంగళంబగును. పైఁగా స్వయంవరోత్సవమఁట. భాగ్యలబ్ధయైన కన్యయఁట. కావున దిగ్దేశములనుండి చక్రవర్తులు వేంచేయుదురు. అకాలంబున మనమచటనుండుట యవశ్యకము. (బ్రాహ్మణునిఁజూచి) బ్రాహ్మణోత్తమా భాగ్యలబ్ధయగు కన్యయని మీరాజుగారు వ్రాసినారు. ఆకన్య యెటు లబ్ధమయ్యె.

బ్రాహ్మ.—మునికులాగ్రణీ! ఆ వివరమును దెలిపెదను వినుఁడి.

సీ. మునికులాగ్రణివిను జనకమహారాజు
  యాగమొక్కటిఁ జేయ యత్నపడుచు,
భూశుద్ధిసలుపఁగ భూమిలో నాఁగేలు
  చిక్కను త్రవ్వింపఁ జెన్నుమీఱ,
మణిమయాలంకార మందసంబొక్కటి
  యగపడెనందొక యందగత్తె,
రాకానిశాకరు రేక చందముఁ గేలి
  సలుఁగారు క్రొక్కాలు మెఱుఁగుమీఱ.
కాంచన శలాక కాంతినిఁ గనులవిందు
గానుచూపట్టె నంత భూకాంతుఁ డెలమి
తనదు కూఁతురుగాఁ బెంచి తనరుచుంట
నిదియ యక్కన్యవార్త యో సదయహృదయ.

విశ్వామి.—(ఇంచుక నిమీలతాక్షుఁడై యోజించి రామచంద్రా నే నిపుడు భూత భవిష్యద్వర్తమానంబులు తెలిసితిని. మనము మిథిలానగరంబునకుఁ త్వరితముగఁ బోవలయును. (బ్రాహ్మణునిఁజూచి) బ్రాహ్మణోత్తమా. నీవిపుడు రాజు

గారిఁజేరి మాయాశీర్వచనంబులందించి మేము యాగసమాప్తమున శీఘ్రము వత్తుమని తెలుపుదుము. (రామలక్ష్మణులనుఁజూచి) శిష్యులారా. మీరు ప్రయాణ సిద్ధులరై యుండుడి. రేపు ప్రాతఃకాలంబుననే మనము వెడలవలెను

రాముఁడు.—గురువరా తమయానతి శిరసావహింతుము.

అనుబంధము 20.

(నిష్క్రమింతురు.)

పంచమరంగము.

గౌతమాశ్రమము.

(విశ్వామిత్ర - రామలక్ష్మణులు - అహల్య.)

రాముఁడు.—(నడచుచు.)

చ. అనఘ వినంగఁగోరితిని, యాశ్రమవాటికయిందుఁదోఁచె; నే
ఘనుఁడు తపంబొనర్చుచును గాంచెను ముక్తిరమావధూటినిన్
వనతలమేల నిర్జనత వాడినదో; యెఱింగింపవే; ముదం
బొనరఁగ విందుఁ బుణ్యులమహోత్తమ చిత్రచరిత్రలన్నియున్

గురువరా! చరాచరప్రపంచంబునఁ దమ రెఱుంగని వార్త లెవ్వియును లేవు. ఈ వనవాటిక యొకానొక కాలంబునఁ నేతపోధనుని యాశ్రమవాటికగ నుండెను? ఇపుడేల జంతుజాల విహీనమై నిర్జనాటవియయ్యెను. విని తెలిసికొనవలెనని మనసులలరింపుగ బిందును.

విశ్వా.—రఘుకులావతంసా! ఈ యాశ్రమమావంత మునివిస్మయకరంబుగ నున్నది. గౌతముఁడను మహర్షి యాశ్రమంబిది.

శ్రీరా.—ఆమహానీయు లిపుడెచట నున్నవారు?

విశ్వా.—హిమవత్పర్వత ప్రాంత్యమునఁ దపంబు సలుపుచున్నవారు?

శ్రీరా.—ఈయాశ్రమంబు వదలు కారణంబేమి?

విశ్వా.—రామచంద్రా ! మున్నభిభూషణుని మోహింపఁజేసిన మోహిని కన్నమిన్న యగు సుందరాంగిని బ్రహ్మసృష్టించి యహల్య యనునామంబొకన్నెకు నొసఁగెను. అమరవల్లభుఁడు దానిసౌందర్యంబునకు మెచ్చి తనకా కన్నెను దారగఁ జేయుమని ధాతను ప్రార్థించెను. విధాత యావిబుధేశుని వేఁడికోలును, తృణీకరించి తపస్సంపన్నతముంచిన గౌతమున కాయువతినిచ్చి వివాహంబొన ర్చెను. నాటంగోలెఁ బాకశాసనుఁడంగజు శరకచేఁ దపించుచుఁ బనిలేనివి కినై ఋష్యాశ్రమంబు సమీపించుచు నొకనాఁడరుణోదయంబున ముని స్నానముకై నదికిఁ బోయి యుండ నింద్రుఁడు తానామునివేషధారియై యహల్యాపాతివ్రత్యంబుఁ జెఱచెను.

శ్రీరా.—హా ! హా ! ఇంద్రుఁడు పెద్దలయెడ నిటటి దౌష్ట్యమొనరించెనా ? గౌతముల కివ్వార్త తెలిసెనా ? తెలిసినేని వారూరకయుండిరా ముందేమి జరిగెను.

విశ్వా.—రామా ! ఎంతటి శాంతస్వభావులు మునులైన నింతటి దౌష్ట్యము సహింతురా ? నిష్కరుణంబుగాని ముష్కరహితుఁడవు గమ్మని యింద్రునకు శాపమొసఁగెను దుశ్శీలయగు నహల్యను శిలాతిగ బడియుండమని శాపతప్త జేసి యమ్మునియవ్వనివదలి హిమవత్పర్వతముఁ జేరెను.

శ్రీరా.—పరదారాభూషణులకుఁ గాఁదగిన శాస్త్రియయినది.

(అనుచు నడుచుచుండ శ్రీరాముఁడు పాదముంచినఱాయి
పగలి లోనుండి యహల్య వెలివడి.)

అహల్య.—వృ. రామా, దశరథరామా, రఘుకులసోమా నినుఁగంటి
భీమా, యసురవిరామా, శ్రీభువనధామా నినుఁగంటి
కామా, సుగుణలలామా యవమతినేమానితి శీలం,
బామానితమునినామాధికతను నెమాన్చితిస్వామి;

అనుచు రాముల పాదములకు వందనంబిడును.

శ్రీరా.—(తిన్నబడి విశ్వామిత్రులఁజూచి) గురూత్తమా. ఈమానినీమణి యెవరు ఱాతినుండి వెలివడెను గదా ?

విశ్వా—రామచంద్రా! నాచే పలుకఁబడిన గౌతముని మునిసతియే యీ యహల్య, యీ నాతియే శిలారూపమున నేలఁబడి యుండెను. నీ పావనములగు పాదముల ధూళి సోకిన మాత్రనె తనరూపమును దాల్చెను. మునియిడిన శాపావధి యిదియేను.

శ్రీరా.—(అహల్యకు వందనంబులిడి.)

క. పూతచరిత్రుండగు నా
గౌతమముని నాతియయిన కారణముననో
మాతా నీకు నమస్కృతు
లాతతముగ సలుపువాఁడ నమ్మా ప్రీతిన్.

(అనుచు రామలక్ష్మణులు నమస్కరింతురు.)

అహల్య.—కం. కల్యాణమస్తు రఘుకుల
కల్యాణోన్నగున కఖిలకల్యాణునకు, న
హల్యాశాప విమోచన
కల్యాణోంచితపదోరు కాంతియుతునకున్.

రామలక్ష్మణులారా! మీకు శీఘ్రముగఁ గల్యాణమగుఁగాత.

విశ్వా.—రామచంద్రా! రామా! శిలారూపమున నున్న యీనాతి పూతచరిత్ర యాయెను. మనమింకఁ బ్రయాణమగుదము.

రాము.—స్వామీ! భవదనుజ్ఞ.

అహల్య.—విశ్వామిత్రా! తమశిష్యుని యనుగ్రహమున నేను మరల నాథు ర్తనుఁ గూడికొని మిథిలానగరంబునకువచ్చి సీత యీ పూతచరితుని వరించు లాగొనరించెద. పోయివచ్చెద.

అనుబంధము 21.

(నిష్క్రమణము.)

శ్రీ

సీతాకల్యాణము.

తృతీయాంకము—ప్రథమరంగము.

లంకాపట్టణము.

(రావణుఁడు-మండోదరి-విభీషణుఁడు-మంత్రులు-చారులు.)

రావణుఁడు.—

మ. అహిలోకంబును జేరి యాబలిబలం బత్త్రాకలం బెట్టితిన్
మిహిరాపాస్తుని లోకమెల్ల వసధిన్ నీరాట లాడించితిన్
మిహిరున్ బట్టుచు వార్ధినుంచి మఱలన్నీతంబుగా నెత్తితిన్
యహహా రావణ విక్రమోర్జితయశం బాశాంతముల్ జేరెఁ గా.

అమాత్యపుంగవులారా! ప్రపంచంబున గల విక్రమాఢ్యులనెల్ల జయించితిని. జయింపవలసినవారు మఱియెవరును లేరు. కావున నాభుజకండూతి హెచ్చయి సదా కాలము నను బాధించుచున్నది నాహస్తకండువు బాధఁ దీర్చువారిఁక నెవరును భువిఁ బుట్టరైరి కదా?

(చారులు ప్రవేశించి.)

చారుఁడొకఁడు.—పులస్త్యవంశాబ్ధి భూషణా బలుబ రాజు.

చారుఁడ రెండవ.—సర్వదిక్పాలక గర్వనిర్మూలకా! బలుబ రాజు.

చారుఁడు 1.—తాపసగణవినాశకా బలుబ రాజు.

చారుఁడు 2.—పరదారాన్వేషణ పరాయత్తచిత్తా బలుబ రాజు.

చారుఁడు 1.—మానినీజనమాన భంగా, బలుబ రాజు.

రావణుఁడు.— చారులారా! మీరేయే దేశంబు లేయేమాయారూపములు ధరించి మిట్టాడివచ్చితిరి. అందేమేవార్తలు వింటిరి.

చార 1.— స్వామీ! సకలదేశంబులు సంచరించితిమి ఎచ్చటఁజూచినను తమ నామస్మరణ తప్ప మఱియేమియు నే వినను.

చార 2.— అరికులవినాశకా! నేనొక మునిశిష్యుని రూపముధరించి విశ్వామిత్రుఁడు యాగమొనరించు వనంబున నుంటిని. ఆ ఋషి తనకు మారీచసుబాహుల నుండి కలుగు విఘ్నములు నివారించుటకయి యయోధ్యానగరంబునేలు దశరథుని సుతులగు రాములను బిలిచికొని వచ్చెను ఆ బాలురు మార్గమునిరోధించిన తాటకను మార్గణంబులఁ జీల్చిరఁట. దప రాముఁడనువాఁడు మారీచుని నొకబాణమున సముద్రమున వైచెను సుబాహుని నొకబాణమునఁ గాల్చెను.

రావణుఁడు.— ఏమీ! ఏమీ! ఒకబాలుఁడు తాటకను బాహుబలంజంపి మారీచుని సముద్రమున వైచెనా? ఔరా? ఇపుడేపోయి యాబాలునిఁ బట్టి ఛీల్చెద. ఓరీ! ముందేమి జరిగెను

చార 2.— స్వామీ! యజ్ఞాంతమున జనకమహారాజునుండి నొకజాబు వచ్చెను.

రావణు.— అందేమి యుండెను?

చార 2.— జనకుఁడు యజ్ఞము నేయ భూమిదున్నించుచుండ, నవరత్నమణిమయ మందసంబొకటి భూమిలో దొరకెనఁట.

రావణు.— (కొంచెక యాలోచించి యందలివిషయము పీడించి) చారకా మఱియేమి?

చార 2.— స్వామీ! జనకమహారాజు మందసముద్రాభంగమొనర్చి చూడ నందొక సౌందర్యవతి యుండినదఁట.

రావణ.— ఏమీ! ఏమీ! ఆమందసమున నొకసౌందర్యవతి యుండెనా? అచ్చెరువు. ముందేమి జరిగెను?

చారణ 2.— ఆయింతి స్వయంవరోత్సవము వైశాఖశుద్ధపంచమి గురువారంబున జరుగునఁట. జనకుని యింటనుండు శివధనస్సు గుణమెక్కించి భంగమొనర్చిన వానికా కన్నె నిచ్చునఁట.

రావణ — అవురా! శివధనుర్భంగమా వీరశుల్కము? ఔరా జనకుని గర్వము?

చారణ 2.—స్వామీ! ఎటులనయినఁ దశరథునిచే నాయింతిని రామునిభార్యఁగఁ జేయవలెనని విశ్వామిత్రులవారు కంకణంబట్టినారు.

రావణుఁ—(ఆక్రోశమున) అసురుఁడనైన నన్ను మానవాధముని దారఁగ నెంచర్వవలెనని యామాపటిలజటి యత్నించినాఁడా? ఎటులొనరించునో చూచెద. (అమాత్యపుంగవునిఁ జూచి) అమాత్యవరా! స్వయంవరోత్సవమును గుఱించిన లేఖ మనకేమైనను వచ్చినదియా.

అమాత్య—స్వామీ! అట్టిలేఖయే లేదు. తమకు లేఖవలదని జనకుఁ డాజ్ఞయిచ్చెనని, కర్ణాకర్ణికగ నేను విన్నాను.

రావణు—ఏమీ! జనకునకపుడే యింతగర్వము వచ్చెనా? ఇపుడే వానిరూపుమాపి యారూపవతినిఁ బట్టి తెచ్చెదను (అనుచు లేచును)

అనుబంధము 22.

మండోదరి.—నాథా! త్వరపడకుము. నెమ్మదినుండుము. నీప్రాణప్రియ ప్రార్థనను వినుము. చారుఁడు మందసవృత్తాంతము వినిచినయంతటి నుండియు నామనమున నేమో భయమెత్తినది. ఆమందసములో నగపడిన మానిని లోకసామాన్య మానిని కాదు.

సీ. సతి వేదవతినాఁడు చితిఁ జేరి యారమా
సతియుంకమునఁ బుట్టె క్షితినిఁగాదె,
ఆ యాదిదేవుఁడే యాజిన దనుఁడయి
యాజిని నిఁజంప నవతరించె,
అలనాఁడు దెచ్చిన కలశమునందున్న
అంగనామణిగాదె యాదిలక్ష్మి,
మందసమందున్న సౌందర్యవతి రాజ
నందినియయ్యె నానందముగను,

గీ. కాన నీవిట్టి తలఁపులు మానునాథ
ముదమునుముడింప నుండుమా మోహనాంగ
యీశ్వర విరోధమేల ప్రాణేశ నీకు?
విశ్వశిక్షక వదలుమా విమవరీతు.

మోహనాంగా! నీపదములపైఁ బడి వేఁడికొనియెద. స్వయంవరోత్సవమునకు నీవు పోవలదు.

విభీష.—సోదరా! నావదినెగారి జాతకము నాయదికి సమ్మతముగ నున్నది. ఆ మందసమందున్న మనిషీమణి దివ్యమానినిగాని మనుజయొకటి కాదు. భూరిమందసమున భద్రముగ ముద్రితయయి సముద్రమునంబడవైచిన భద్రేభయాన భద్రముగఁ దరిఁజేరి భూమిలోఁగ్రుంగి యాహారరహితయై వత్సరములకొలఁదిఁ బ్రాణమున బ్రదుకుట మానవకన్యకు సాధ్యమా ఆ సుందరి యేదోయొక కారణంబున భువిని జన్మించిన దివ్యకాంతయనుటకు సందియము లేదు. సోదరా! బ్రహ్మవరప్రసాదివి నీవుగావున నీకు నెవరినుండియుఁ జావులేదని తెలిసితివి కాఁబోలు. దైవవిచేష్టితంబులు దురూహ్యంబులు. మధు హిరణ్యాక్ష హిరణ్యకశ్యప సుందోపసుందులు మొదలగు దానవులు బ్రహ్మనుండి వరమందరా? వారేల మడసిరి? ఇవియన్నియుఁ జక్కఁగ నాలోచింపుము.

రావణుఁడు.—(క్రోధమున లేచి.)

చ. విమతుఁడికె మూఢులార యిటు భీతినిఁ బల్కుట రోఁతగాదె; మీ
జడతను దెల్పికొంటి రిదిస్సెఁ పను సేఁ గడుహీను మాడ్కి; నీ
వుడమి సజీవప్రేతఁగను బొందని నే మవఁజాల; నింక నా
కడిమినిఁజూపి బాహువులకండువు మాన్పెద సంగరావనిక్.

విభీషణా! నీ నామము సార్థకమయ్యెను. నీతపంబు బూడిదెలోని హోమంబయ్యె. రైకసీగర్భంబున నీవు పుట్టఁదగిన వాఁడవు కావు మందోదరి నారి కావున భీరువై పోరుఁగోరదు. నీవు దానవుఁడానికంటెను హీనబలుఁడవైతివి. నినుఁబోలువారి మాటలు వినుచు నేనుంటి నేని మీకంటెను బలుఁడ నగుదును. కావున నేనిపుడే వెళ్లెద.

అనుబంధము 23.

(నిష్క్రమణము.)

ద్వితీయరంగము.

అరణ్యము.

(రావణుఁడు - చారులు.)

రావణుఁడు.—ఏమీ! మిథిలానగరంబునందలి సమాచార మేమయినది. యచటికి నేయే రాజులు వచ్చినదియు, నాసౌందర్యవతి సీత యేయే కాలముల నెచ్చటెచ్చట యుండునదియును దెలిసికొని యీమార్గమున నే రండని చారులను బంపితిని. వారేలనో యింకను రాకయున్నారు. ఆసీత మయూఖవదనయగు సీతను నే మనసారఁ గౌఁగలించి తనివిదీర రతిసుఖములఁ దేలు టేనాఁడో కదా. ఆయిందువదన నన్ను బొందునా? నావశవర్తిని యయినపిదపఁ రతికేళిని ననుఁ బొందక మఱియేమి చేయఁగలదు?...(ఆలోచించి) ఏమి సేయుదు. శివ ధర్మభంగము సేయు టెట్టుల? (తలయూఁచి) కూడిన రాజులసరకు సేయక సీత నెత్తికొనివచ్చెద. శివధనువు జోలికి పోనేల?

(చారుల ప్రవేశము.)

చారులు —రాక్షసకుల స్వామీ! వందనంబులు.

రావణు —చారులారా! సమాచారము లేమి?

చారులు —స్వామీ! దిగ్దేశాధిపతులు వచ్చియున్నారు. వారిపేర్లు మాకుఁ దెలియవు. తాపసివరుల నేకులు వేంచేసినారు. అందులో నొకఁడు విశ్వామిత్రుఁడఁట. అతనిఁ జూచిన వారంతయు గడగడ వణఁకుచున్నారు. వానివెంట దశరథనందనులు రామలక్ష్మణులను బాలురిరువురు వచ్చియున్నారు. అతిసుందరాకారులు. రామునిఁ జూచి వారందఱు నతనినిఁ బూజింతురు. ఆరాముఁడను దిన దినము సాయంకాలమున నారాముఁడు జేరి జనకనందనతో మాటలాడు చుండును. గౌతముబుషి భార్య యహల్య సీతను వెంబడించి యుండును.

రావణుఁడు —చారులారా! మఱియెవ రచటికి వచ్చియున్నారు?

చారులు.—స్వామీ! ఏవఁడో పరశురాముఁడఁట. రాజకులాంతకుఁడఁట. కార్తవీర్యార్జునుఁడను వేయిచేతుల విక్రమాఢ్యుని నొక్కనిమిషమునఁ జంపెనఁట.

రావణుఁడు.—ఏమీ! కార్తవీర్యార్జునునిఁ జంపిన పరాక్రమవంతుఁడు పరశురాముఁ డచటికి వచ్చినాఁడా?

చారులు.—నిజమండీ! వచ్చినాడు.

రావణుఁడు.—చారులారా! మీరిఁక వెళ్లుఁడు.

(చారులు నమస్కరించి వెళ్లుదురు.)

రావణుఁడు.—(చింతనభినయించుచు) హా! హా! అమహావీర్యుఁడు, తపస్సంపన్నుఁడు పరశురాముఁడున్నచోట నాభుజవిక్రమంబు చెల్లదు. కరసహస్రములు కలిగి యవక్రబాహువిక్రమమున ననుఁ బట్టి బంధించి చెఱనుంచిన కృతవీర్యునిపుత్రుని హతుఁజేసిన జామదగ్న్యుండుండు స్థలమున నే నిలువఁగలనా? వలదు. అచటికిఁ బోవలదు. (ఆలోచించి) నాయాస్థానమున సీతను బట్టితెత్తునని పలుబింకములు పలికి యిపుడూరకపోయిన నవమానము బగును. అటులైన నేనిపుడేమి సేయుదును. (క్రిందుమీదులుచూచి) నిజము! నిజముటు నేనీన సీత నాసరసఁ జేరును. ఆయుత్తకాంతని నెత్తికొని నాపురిఁ జేరెద. ఇపుడే నానేర్చిన మాయలు పన్ని మాయారాముఁడయ్యెద.

(నిష్క్రమణము.)

తృతీయరంగము.

జనకుని పట్టణము. (మిథిల.)

(విశ్వామిత్రుఁడు - మోహిని.)

అనుబంధము 24.

విశ్వామిత్రుఁడు.—(స్వగ) అహల్యామూలకమున రాముఁడాదిదేవుఁడనియును సీత రమావతారమానిని యనియును, జానకికిఁ దెలిపి వారిరువురకును వివాహంబున పరస్పరసల్లాపములు జరుగునంతటి స్వాతంత్ర్యముకలుగఁ జేసితిని. శివధనుర్భంగము రాముఁడుదప్ప మఱియెవరికి సాధ్యము కాదని నేనెఱుంగుదు. ఇఁకఁ జనకరాజునకు సాధ్యముందమా యతని యవతారపరిమితి నిండినది. శ్రీరా

ములకీర్తికి వన్నెఁబెట్టి యతఁడు తనయంశము పాలించుకొనఁ జూచుచున్న వాఁడు, రాములకు సీత సహధర్మచారిణి యగుననుటకు సందియములేదు. ఇఁక దశకంఠుఁడు పిలిపించుకున్నను వచ్చి దుడుకున సీతనెత్తికొని పోవునని నాయంతరాత్మ తెలుపుచున్నది. కావున నేనొక మాయాసీతనుగల్పించి వానియెదుట నగపడఁజేయవలెను. అటులనే సెద! విశ్వామిత్రసృష్టిసామర్థ్యంబున నూతనప్రపంచమేకలుగుచుండ నొకమానినీమణికలు గదా?

(నిమీలితాక్షుఁడై.)

ఉ. సోగమెఱుంగు తేజమున సోయగమందిన పూవుఁదీగయో
నాఁగవెలుంగుచుఁ బురుషనాగకులాంకుశమై చెలంగుచున్
వాగమృతంబుఁ జిల్కుచును వారిజపత్త్ర విశాలలోచనా
వేగమె రావె మోహిని నవీనవిలాస విహారవాహినీ.

(మోహిని భూమిలోనుండి వెడలి మునికినమస్కరించి)

కం. యతిలోకపూజితా నను
క్షితినిఁ బుట్టించుకతముఁజెప్పిన, విూ, యా
నతిరీతిని వర్తించెద
నతిశయమతి నెంత కార్యమైనను జేతున్.

విశ్వా.—మోహినీ! నీవనినంత కార్యంబు సేయసమర్థురాలవు. కావుననే దేవతా కార్యము లెల్ల నీనుండియే నెఱవేఱును. ఆదిదేవుండగు శ్రీమన్నారాయణుఁ డీభువిని రావణవధార్థము మానవజన్మమెత్తి శ్రీరామరూపమున నున్నవాఁడు. రమాదేవి మానినీమణియై సీతారూపమున భువిని జన్మించినది. వీరిరువురికి కల్యాణమహోత్సవంబింతలో జరుగును ఆ శుభకార్య భంగమొనర్ప రావణుఁడు మాయారాముని వేషమును ధరించి సీతనెత్తికొని పోవలయునని యత్నించినాఁడు. ఇది దివ్యచక్షువులచే, గనిపెట్టినాను. కావుననే నిన్నుఁ బుట్టించితి. నీవు మాయాసీతవై యుపవనమున సంచరించుచుండుము. మాయా రాముఁడు నిన్ను గాంచి యెత్తికొని లంకకుఁబోవును. అపుడు నీవెవ తరుణమని తెలిసి యదృశ్యవగుము.

మోహిని.—యతికులాగ్రణీ ఎల్ల కాలము నా పుట్టుకయే రాక్షసకులనాశనమునకుం
కావున మీరానతిచ్చినపని నిర్వహించెద.

విశ్వా.—మంచిది! పోయిరమ్ము.

(మోహిని నిష్క్రమణము.)

అనుబంధము 25.

(స్వగ) ఆ దశాననముఖభంగమునకుఁ గాఁదగిన కార్యంబెల్లఁ జేసితిని. రావణునకిఁక నాయుఃపరిమితికాలంబున్నది. కొన్ని దినంబు లుండనిమ్ము. శ్రీరాముల కల్యాణ మహోత్సవంబుఁ గావలయును. దశరథునకు మునియిడిన శాపఫలంబనుభవంబునకు రావలయును. కాననాంతర దానవఖండన మిఁకను గాఁదగి యున్నది. ఇవియన్నియును సిద్ధించినపిదప రావణ కులనాశనంబగుఁగాత.

(నిష్క్రమణము.)

చ తు ర్థ రం గ ము.

ఉద్యానవనము.

(మాయారాముఁడు - మాయాసీత - చెలికత్తెలు [ప్రియంవద-భద్ర.)

అనుబంధము 26.

హరిగతిరగడ.

భద్ర.—మూలమూలల నేలడాఁగెదు ముగుదడాఁగుడు మూఁతలాటల.

సీత.—చాలు కలనకుఁగాలుద్రవ్వకు చాన నీ వికటంపు మాటల,

ప్రియం.—కేలు కేలునఁ జిఱచి పాఱెదఁ గీరవాణిరో నన్నుఁగూడుము.

భద్ర.—బాలతోఁజెలకులగోలా పాడినాతోఁ బంతమాడుము.

సీత.—నీలవేణిరో నిన్నుఁగెలిచెద నీటిఁబాతలవచ్చి చూడుము.

ప్రియం.—కాలమా యెదిరలమాముననును గలికితో మున్న నలువేఁడుము.

భద్ర.—ఇంతి యెంతటివింతలమ్మరో యిట్టిమాటలఁ గలహంసగునేటు.

సీత.—కాంత కలహంసంబులకు మాలము కాకుకూఁతల పెచ్చు గాదెటు.

ప్రియం.—అమ్మ కనవే సౌరభమ్ముల నలరునలరులు గొమ్మగొమ్మకు.

భద్ర.—నిమ్మలనుగొని భోజనాటుదా, నిమ్మలకు నిఁకనమ్మలింపకు.

సీత.—బాలనేలను వాలకిటులటు బండికొనితినుమావిపంటిని.

ప్రియం—కేలుసాచుమనందికొమ్మ కీలెఱిఁగి ముక్కంటిపంటిని.

భద్ర.—గోటఁగిల్లకె క్రొవ్విసీవిటు కోసులాంగిరో లేఁతమురువము.

సీత.—చాటితెల్పెద వినినంటవె చానచెల్లను నీడుగరువము.

ప్రియం.—అమ్మమిన్నా పొన్నపూవులు నందునేమో నిక్కచూడవె.

భద్ర.—సన్నుతాంగిరో నిన్న నైత్రైవఁ జిక్కగా, నవి గనుమఁ గోయవె.

సీత.—మేలుమేలిది యెంతతెంపరి మీఁదికొమ్మనుఁ బట్టివెసఁజని

ప్రియం.—చాలుజాలిఁక ననలుగొనుమని చల్లఁగాఁ గూర్చుందమటువని.

భద్ర.—అలసగమనరో యలసితేమి యలరులను గొనివత్తుమటఁజను.

సీత.—వెలఁది నేనెటు మిమ్ము వదలుదు వెదలనెటులగు నమ్మకనుఁగొను.

భద్ర.—ఆరామవిహారంబున నలసితివియా సీతా.

సీత.—అమ్మా! భద్రా! ఆరామవిహారము నేను సదాకాలము గోరుచు తదే
కధ్యానమై యున్న దానను! అలసత నాకెపుడును లేదు.

మాయారాముఁడు —(డాఁగికొని ప్రక్కననిలిచి) ఔరా! దీనివాక్చమత్కృతి.

క. ఈరామ వాక్చమత్కృతి
యేరామలకైనఁ గలదె యిలలోఁ గనఁగా
యీరామవిహారంబన
నా, రామవిహార, మనెడు నర్థము చేసెక్.

ఇఁక నిందెడాఁగి యీబింబాధరమధుర సుధాధారల చవిఁజూడఁగొనియెద.

ప్రియంవద.—సీతా! మన మవతలంబోయి వరపుష్పములను గొని మందిరంబునకు వెళ్లుదము.

సీత.—అమ్మా! ప్రియంవదా! నేనిచటనే యుండి కోరినవరపుష్పమును నరసెద. మీరెందైనను బోయి పుష్పములను దెచ్చికొనుఁడి.

మాయారాముఁడు —(మఱుఁగున) ఔరా దీనిశబ్దశ్లేష.

క. ఈవరవర్ణినిఁ బొగడఁగ
మావర వాగ్వరులవశమె మధురసధుర్యై
యా "వర పుష్పం" బనఁగా
దా "వరపుష్పం" బటంచుఁ దనరెను మదిలోన్.

ప్రియంవద.—సీతా! నీమానస మొకతీరున మారినది. ఏకాంతస్థలమున నేకాంతముగనుండి నెమ్మదిఁగనుము. (ప్రియంవదా. భద్రలు పోదురు.)

మాయాసీత.—ఈచెలులు నైతము నేను నిజముగు సీతయని తలంచినారు. ఆ రావణుఁడు రాముని రూపమునుఁగొని యిందు డాఁగినాఁడు. నామాయాసీతత్వ మించుక చూపి నామాయలవలలో వానినిఁ గడిపెద. రామువిరహమునఁ బరితపించు దానిబలె నటించెద.

(నిట్టూర్పుసారించుచు.)

సీ. హా రామ రామ నే నారామమునఁ దూఁటి
యారామలనుఁ జేరి యారజమునఁ,
గోరికలీరిక లూరముడంబొర
గారవంపు విహారసారమతిని,
మీఁటుచు విహరింప మితిమీఁటిమలఁ గేరి
తీరుగాని వికారభార మయ్యె,
గిరగిరమని కులగిరులు తిరుగసాఁగ
నరుదారనాకసంబవనిఁ బడియె.

గీ. తెమ్మెరలశైత్యమక్కటా దిమ్ముపట్టెఁ
చిలుకపలుకులు చెవులకు ములుకులయ్యె
నళులయులివులు నాకశులయ్యె నకట
చెలులపల్లావములు బిలుచిలువలయ్యె.

ఆ! ఆ! ఆసుందరిని సంయోగాభిలాష హెచ్చయి నామానసమాపురుష రత్నదర్శనమునకు సువ్విళ్లూరుచున్నది. అయ్యో నాతండ్రి శివధనుర్భంగము వీర శుల్కముగ నేలయొడ్డెనో? ఏవండో యొకకురూపి శతగళాయుతసత్వుండై యాధనువును విఱిచినచో నాగతియేమి! అట్టివికారమనుజాని గట్టుకొని కలకాలము నేవానిని గూడియుండవలయును గదా! దైవమా! అంతటిదుఃఖమునుండి నన్ను వెలివేయుదువని వేఁడెద.

అనుబంధము 27.

మాయారావణుఁడు.—ఆసుందరాంగి చెరసఁజేరుటకు యుంచినసమయంబిది. పోయెద.
(సుందరికివచ్చి మాయాసీతనుఁజూచి.)
ఔరా! దీనియంగసౌందర్యాతిశయము.

సీ. సుందరిమోమహా యిందుబింబముగెల్చె
కరియానకురు లళిగరులగెల్చె,
చలిఫాలఫలకమ్ము చంద్రార్ధమునుగెల్చె
కమలాక్షి కనులంబు జముల గెల్చె
అళికచకనుబొమ లమ్ములనెఱిగెల్చె
లోలాక్షిపీనులు శ్రీలగెల్చె
మగువరదశ్రేణి మగఱాలచవిగెల్చె
చెలిచెక్కులద్దము చెన్ను గెలిచె.

గీ. చిఱునగువుగెల్చె వెన్నెలచికిలిచెన్ను
నెలఁతగోరులుగెల్చెఁ దారలినుదాది
యారశృంగార రసభరితాంగ యగుచుఁ
గలికి కనుఁగవఁ జూడక గెలిచె నన్ను.

ఈ చెలువ చెలువమ్ముఁ గని కదియక నే నిలువఁజాలను. పల్కరించెద. సీతా! ఏలచింతించుచుఁ గూర్చుంటివి.

సీత.—రామా పావనామా వైభవజితసుత్రామా. నేఁడేల వేళకు రాక తడసితివి. చేయఁదగినపనులు హెచ్చుగ నుండెఁగాఁబోలు.

అనుబంధము 28.

రాము.—రామామణీ! నీముఖేందుదర్శన లాభంబుకంటె నాకేపనియు నింపని తోఁచదు. అయినను విశ్వామిత్రుల సరస నేనుండుతఱి సహల్యవచ్చి దన్నుఁ జారకాంతుఁ డెటువంచించినది తెలుపుచుండెను. ఆగాథ వినుచుండ నించుక ప్రొద్దుపోయెను.

సీత.—నిజము! విటీవిటుల వృత్తాంతములు పురుషులకు బహురుచ్యములుగనుండును.

రాము.—జానకీ! అవృత్తినినుండువారి కటులుండునేమోకాని నాకట్టిమాటలరుచింపవు. అయినను సౌందర్యవతిని నేకాంతస్థలమున జూచి సహించికొని యుండుట పురుషునకు సులభసాధ్యముగాదు.

సీత.—కావున నే పురుషులుండు తలములందుఁ జెలువ లొంటరిగ నిలువఁ జనదని పెద్దలాడెదరు. నే నిచట నొంటరిగ నిలుచుట ధర్మముగాదు. రిత్తఁగనప నింద లువచ్చును.

రాము.—మంత్రకాశినీ రిత్తఁగ నపనిందలు రానేల మనచిత్తవృత్తు లాద్దిగ మత్తినపుడు చిత్తజుని కేళినిఁ గూడి సుఖసాగరమున నోలలాడుదము.

సీత.—రామా! నీవు సమస్తనీతి శాస్త్రకోవిదుఁడవు. విశ్వామిత్రులవారిచే శిక్షితుఁడవు. ఇటులుండియుఁ గన్నెనగు నన్ను వివాహమునకు మున్న స్మరకేళిఁ బిలువనగునా? యిదిధర్మమా.

అనుబంధము 29.

రాము.—సాధ్వీ! సమస్తనీతిశాస్త్రములు మాకు నానతిని లోఁబడినవి. గ్రంథశోధన వలన నీతివిధులు నేర్చినవారందఱు నాచారమున దుర్నీతిప్రవర్తకులు. దీనికి నిదర్శనము మాగురువగు విశ్వామిత్రుఁడే. మూఢులకు బోధింప నాశాస్త్రములు పుట్టినవి కాని శాస్త్రకోవిదులకవి యన్వయింపవు. సాధ్వీ! మాకును

కొండుటనా నీతిబోధన వలదీ ధర్మవాక్యములు అల్లదిగో దూరమ్మున సౌధరంగా రమ్ము నగపడెడు. అందు జేరి మాటలాడుదము రమ్ము. (సరసంజేయును.)

సీత.—హా హా! ఇంతటిమదుడవు సతులయెడం జెల్లదు దూరమునసుండి మాటలాడుము.

రాము.—నారీ! ఇంక మనయిరువురికి దూరము దూరముగ నుండనిమ్ము రమ్ము

సీత.—ఓరీ! దినదినమీవనమునకు వచ్చు రాముండవు నీవు కావని నాకుం దోంచెడు. ఆ రాముండు అరసు రాముండు సుగుణాలరాముండే. నీయట్టి యధర్మవృత్తి కలనైన నెఱుంగండు నీవేమా నిజముగ రాముండని నాకుం దోపదు

రాము.—వనితా! నే నేరాముండైన నేమి, రతికేళిని నీదినమున నే నినుం గూడ వచ్చినాడను

అనుబంధము 80.

సీత.—దుర్నీతీ! నేను పెద్దలుమీద నుండుదానను. నన్నీరీతి బలాత్కరించుట ధర్మ విరుద్ధము.

రాము.—నాతీ! పెద్దలో! గద్దలో ఇచటనీకునీవే స్వతంత్రురాలు మారశాస్త్రాభ్యాసము నాకలవడినటుల నీతిశాస్త్రములవాటు కాలేదు. మారునకు నే వెఱచినటుల త్రిమూర్తులకైన నే వెఱవను. కావున నీగడియన నిన్నుం గూడెద. నీవై సమ్మతించిన మేలగు. కాదేని నీ విషయమున బలాత్కారమే గతి.

సీత.—ఓరీ! దుష్టమానవా. నీవు రాముండవు కావు. నిజముపలుకుము. నా వెలుల భరసనే యున్నవారు. వారినిం బిలిచి నిన్ను శిక్షించెద.

రాము.—వనితా! శిక్షించుట - రక్షించుట నాయధీనము నన్నెవండు త్రిభువనమున శిక్షించువాండా చూచెద. ఇదిగో నిన్ను బలవంతమున నెత్తికొనిపోయెద విచారపడి మొదరో కానిమ్ము వారినిం జీర్చెద (ఎత్తుకొని పోవును.)

(నిష్క్రమణము.)

పంచమరంగము.

మిథిల - (భటులిరువురు.)

చండుఁడు.—ప్రచండా! బ్రదికినన్ని దినములు మర్యాదగఁ బ్రదికి తుదకు నవమానంబు దెచ్చికొంటిమి. ఇఁక మని ప్రయోజనము లేదు.

ప్రచండ.—చండా! ఏల! అంతగ వేసరిలి మాటలాడెదవు. అవమానము మాకేనా. వేయుగురు బలాఢ్యులకు నైత మయినది.

చండుడు.—నిజము! ఆయంబునకుఁ బ్రాణమున్నదో యేమో. చిన్నతనము నుండి నేఁ జూచుచున్నాను. సహస్రజను లెత్తినచో లేచుచుండెను. ఇపుడో యావగింజెత్తయినను లేవదు. పాతదయినకొల్ల దానితూనిక బలముగుచున్నది.

ప్రచండ.—నిన్నటిదిన మా మహాదేవి మాతల్లి సీతమ్మ లేనిచో నాచాపము మారాజుగారి కొలువుకూటమునకుఁ దెచ్చుట యసాధ్యముగ నుండెను. మాతల్లి మాపాలిదైవముగవచ్చి నన్ను రక్షించెను.

చండుఁడు.—అవునురా! ఆబంగారు జానకమ్మకు నింతబల మెచ్చటనుండి వచ్చియుండురా.

ప్రచండ.—అయమ్మ! యాదిదేవియఁట జగమే యామెక్రింద నున్నదఁట.

చండ.—నిజముండును. కాదేని యంతటిభార మెత్తునా.

ప్రచండ.—ఏందఱో మారాజులు మొనగాండ్లబలె వచ్చినారు. అందున నొకఁడైనను దాని నెత్తునేమో చూచెద.

చందు.—ఎత్తుటయే కాదు! దానిని విఱువవలెను.

ప్రచం.—తినితిని చందులు బలసినటుల బలసినారు. వారిచేను వారెత్తికొనినఁ జాలును. అంబునెత్తుమాట యున్న.

చందు.—చూతము! వినోదము. రేపు ప్రాతఃకాలముగదా యుత్సవిఁ బ్రారంభముగును. నేఁడేల యామాటలు. వచ్చినరాజుల తిండికి బియ్యము. పేడలు బెల్లము నెయ్యి కూరలు కాయలు పప్పులు యిచ్చి తెచ్చియిచ్చునంతలో మాయొళ్ళి మయిపోయినది. కంటికి నిండుక నిదుర యంటినతోడనె తెల్లఁగఁ

చెల్లజాలకున్నది. మఱలఁబనికిఁ బ్రారంభము మనప్రాప్తి యిటులున్నది. విమింతనికాని యేమిప్రయోజనము. పోవుదము రమ్ము.

(నిష్క్రమణము.)

ఆఱవరంగము.

జనకరాజాస్థానము.

(విశ్వామిత్రుఁడు-రామలక్ష్మణులు-పరశురాముఁడు-రాజులు జనకమహారాజు - సీత - చెలికత్తెలు - ఊర్మిళ - శివధనుస్సు.)

జనకమహారాజు.— (కూడినరాజులఁ జూచి)

ద్విపద.— రాజితసత్కీర్తి రాజిలఁజేయు
రాజన్యులారయో రారాజులార
భూభుజులారయో పూతాత్ములార
భూభారమును మోయు పుణ్యాత్ములార
కనుఁడి యామెదనుఁ గలకనకాంగిఁ
గనుఁడియిచ్చటనుండు కఱకంఠుధనువు
భూరియాగమునకునై భూశుద్ధిఁజేయ
భూరితపఃఫల పూజ్యమైతనరె
లావణ్యసీమయా లలనలలామ
యీవసుంధరలోన నింపారుచుండె
ఆకన్నెఁజేకొని యంతరంగమున
చేకొన్న ముదమున మేనుబ్బినాడ
ముద్దులసుతఁగాను ముదమారఁబెంచి
విద్దెలుచెప్పించి పెద్దఁజేసితిని
మునునిరీశ్వర యాగమునుఁదలఁబెట్టి
ఘనుఁడుదక్షుఁడు సురగణసహాయమున
సవనముసలిపెడు సవరణనుండ

భవుఁడుగ్రుఁడై వారి భంజింపఁదలఁచి
యాధనువునుఁ జేసి యీయఁబోంద సురల
బాధింపనమరులు ప్రార్థించిరంత
వరదుఁడై రుద్రుఁడీ వరచాపము పుడె
సురలకునిచ్చెను శుభకరమనుచు
ఆలముబాసఁగదే వాసురులకును
మేలని సురలకు మీసరముగను
మామూల పురుషుండు మాన్యుఁడై సురలఁ
బ్రేమించి కావఁగాఁ బ్రీతిజనించి
శ్రీకరమైనట్టి శివచాపమిచ్చి
పాకారిచనెనుసం భావ్యుఁడై మున్న
తరతరంబులుగాను ధనువు మాయింట
గురుతర పూజలు గొనుచుండుఁగాదె
సురుచిర తారుణ్య శుభదయై మించు
తరుణీమణినిఁ గోరు ధన్యులేరైన
వింటినెత్తుచునీడ్చి విక్రమంబునను
తుంటులు గావింప దొరకునీకన్నె
కావున వేగమె కలకంఠ ధనువు
లావులాఘవములు లిలియొప్పఁజూపి
భంగింపుఁడయ్యయో బాహుశాలార
రంగారకన్నె మీ రమణియై మించు

రాజన్యులారా! మీరందఱు బాహుజన్ములు కావున విధివిధానంబగు స్వయంవరోత్సవక్రమము మీకు నెల్లరకు వెద్యముగ నుండును కావున పురాతనవంశక్రమంబున విల్లు సరసకు రానగును.

కాశిరాజు.—జనకమహీపాలా! పురాతనమునుండి మాయిలువేల్పు కాశీవిశ్వేశ్వరుఁడు కావున నే నీ యీశ్వరధనుర్భంగంబు సేయఁజాలను.

అనంతీశ్వరుఁడు.—మిథిలామేదినీధవా! నేను గురుశిక్షితుఁడనై పార్థివపూజ సదా కాలంబు సలుపువాఁడను కావున శివ ధర్మభంగము సేయఁజాలను.

మాగధుఁడు.—జనకసార్వభౌమా! నిర్గతపాపవర్గమై మించి యపవర్గమార్గదమై రహించు దక్షనాయోపాసనాదేవి కావున నీభర్గుని చాపభంగంబు నేఁ జేయఁజాలను.

కేకయాధీశుఁడు.—మదములుడిఁగి ముచ్చటలడఁగి మీసములుదలవడిన ముదుసలి నితాన నాముద్దియ నాకుపలదు. ముక్కంటివింటినిఁ దుంటలుగావింప నేనోఁప

ఉత్కలాధిపతి.—జనకచక్రవర్తీ నేను భూదారుఁడను ఆసీత భూజాత. కావున నాసతి నాకు సుతయయ్యెను. కాన సతీశుని చాపము నేనెత్తినను ప్రయోజనము లేదు.

హైహయాధీశుఁడు.—జనకసార్వభౌమా! నాశక్తికి నీచాపమెత్తుట యొకవిషయము గాదు పరశువును ధరించి యీపరశురాములవారిచట నున్నవారు వారినిఁ జూచినక్షణముననే నాభుజసత్త్వసారమెల్లను నిస్సారమాయెను. కాన నీ శర్వుచాప మెత్తనోప.

మిగతరాజులు—(చాపము సరసకుఁజని యెత్త నుద్యమించి క్రిందఁబడుదురు.)

జనక.—ఏమీ! భూభుజుల భుజసత్త్వమంతయును భూమిలోఁ బూడిపోయెనా? ఈ ధనువెత్తునంతటి భుజబలాఢ్యు లీ సభ నెవ్వఁడును లేడా. క్షత్రియవంశము నకు దుష్కాలము ప్రాప్తిల్లెను.

విశ్వామి—(రాములనుఁజూచి) రవివంశాంబుధిసోమా. దశరథరామా ఈజనకమహా రాజుగారి వాగ్బాణంబులు నీమేనంటవా.

రాము.—గురువరుల యానతిలేక యెప్పనియు నొనరింప నేనశక్తుఁడ. కావునఁ దమయాజ్ఞ నిరీక్షించుచున్నాఁడను.

విశ్వా.—రామా! నీవినయమునకు నేమెచ్చితి. నీకుఁ గల్యాణ సమయంబిది. కావున నీపార్వతీవల్లభుని చాపమును నుతించి త్రొక్కి విల్లెత్తి విఱువుము.

రాము.—భవదాజ్ఞ (ధనువు సరసంజేరి.)

అనుబంధము 31.

సీ. శంభోమహాదేవ, శంభోమహాదేవ
శంభోమహాదేవ శర్వశరణు,
మృత్యుంజయాపాహి మృత్యుంజయాపాహి
మృత్యుంజయాపాహి; నిత్య శరణు,

అద్రీశజాధీశ, విద్రావితాఘౌఘ
భద్రాశ్రితే పాహి రుద్ర శరణు,
ఆకేశకేశాను రాధీశవంద్యత్రి
లోకేశ్వరా, మృడా నీకు శరణు,
ఆంబాసమాశ్లిష్ట లంబోదరాపత్య
బింబాధరా నిరా లంబశరణు,
ఈక్షాహతానంగ దాక్షాయణీ నాథ
మోక్షప్రదా దీనరక్ష శరణు,
ఉక్షేశసంచార యక్షేశసమ్మిత్ర
దక్షార్చితా పాప దహనశరణు;
ఊహాపథాతీత మాహాత్మ్యసంయుక్త
మోహాంతకా వీతమోహాశరణు.

గీ సచ్చిదానంద యీశ్వరా శరణు శరణు
సర్వలోకేశ, యీశాన శరణు శరణు
సర్వకల్యాణ భూతేశ శరణు శరణు
సామగానప్రియానీకు శరణు శరణు.

మ నగజశ్రీకర నాగహార నగబాణాకార నాకీవరా,
జగదాధార మృగోరుచిహ్నితకరా సారంగచర్మాంబరా,
నిగమాంతాంచితమందిరా శశిధరా నిర్ధూతరక్షఃపురా,
దిగధీశేశ్వర పార్వతీశ్వర హరా, దీనావనా ప్రమొక్కు-దక్.

(అనుచుఁ జాపంబునకు మ్రొక్కి కాలివేలితో చాపం బెత్తి గుణమాకర్షించిన
మీఁదవ ధనుర్భంగమగును దేవతలు పైనుండి పుష్పవర్షము గురియుదురు. మంగళ
వాద్యములగును. సీత దిగివచ్చి పుష్పహారంబు వేయును.)

పరశురాముఁడు —(దూరమునకువచ్చి) (స్వగ) నా యంశ కాలము ముగిసినది.
ఆది దేవుండు వేఁటాకరూపమున శ్రీరాముఁడై యవతరించినాఁడు. ఇఁక నేఁ

నిచటనుండి ప్రయోజనంబు లేదు. త్రిలోకకంటకుఁడగు రావణుని వధార్థము నాబలమెల్ల నీరామునందా విర్భవింపఁజేసి నాయవతారము విరమించుకొని యెద. (ప్రకాశముగ.)

చం. మదకరి యుంచుదంటుల సమగ్రముఁ జీల్చెడురీతిగాను, దు
ర్మదులగు బాహుజన్మకుల రక్తముఁ దర్పణ వారిఁజేయఁగా
మది నిరతవ్రతంబుగను మన్ననఁజేయును జామదగ్ని యం
చెరవెఱఁగంద కీచెడుఁగుఁ జేతలుసేసిన వీనిఁ జంపెదన్.

ఓరీ! దశరథనందనా! బాలకా! త్రిలోకాధిరాముఁడనయి నేనుండ రామనామంబువహింప నీవెంతవాఁడవు. నిన్నిపుడే రూపుమాపెద. పాతపడి పురుగంటిన యీశునివిల్లు ద్రుంచితినని నిక్కెదు.

రాముఁడు.—

చ. అపరాధంబు క్షమింపవేఁడెదను రామా! కావవే నన్ను నా
త్రిపురారి ప్రియభక్తుఁడేననుచుఁ బ్రీతిన్ బ్రార్థనల్ సేసి, యీ
శపరాధీనహృదబ్జుఁడై ధనువునే శాసించితిన్ దేవ తా
ధిపు లిక్కార్యము సంస్తుతించిరి కదా! దీనావనా గాంచవే.

దేవా! పరశురామా! నీవు పురాణపురుషుఁడవు. పరాక్రమశీలుడవు. నీయెడల నే నేయపరాధంబొనర్పను. నాపైఁ గినుకయేల. వలదు. మిము బ్రార్థించెద.

పరశురాముఁడు.—ఓరీ! దశరథరామా! పురాణపురుషుఁడవని నన్ను హేళియొనర్చెదవా. నీగర్వమార్చెద. ఆత్రిపురారిపురాణచాపభంగముఁ నీసామర్థ్యంబు చాటదు. ఇదిగో నా నవీనకార్ముకంబు దీనినెత్తి గుణమెక్కించిన నీసామర్థ్యంబు వెల్లడియగును.

(అనుచుఁ దనచాపంబు క్రిందవైచును.)

రామ.—ఔ! ఔ! పరశురామా! పెద్దలయెడ వినయవిధేయతఁ జూపదగినది విధియని వినమ్రుఁడై నేను నటించినమాత్రాన నీవు నిక్కినిక్కి ప్రల్లదంబులు పలుకుచున్నావు. ఇదిగో నీ చాపంబెత్తెదఁ జూడుము. (అనుచుఁ జాపము

త్రి గుణము సారించి బాణంబు తొడిగి) ఓరి పరశురామా! నా బాణంబమోఘంబు. నీ ప్రాణంబుఁ దీయు దీనికి నేమి లక్ష్యముగ నుంతువు?

పరశురాముఁడు.—(భీతిని గడగడ వడఁకుచు) రామా! పరంధాముఁడవు. ఆదిదేవుఁడవు. నీబాణమునకు గురి నా సత్త్వసారము.

రాముఁడు.—(పరశురామునిబల మెల్ల బాణమునఁ దీల్చును) పరశురామా. నీ విఁక నీ దేశమున నడుగిడక సముద్రతీరమునఁ బడియుండుము. పొమ్ము.

అనుబంధము 32.

(పరశురాముఁడును రాజులు నిష్క్రమింతురు.)

జనకు.—మునికులాగ్రణీ విశ్వామిత్రా. నేఁటికి నాజన్మము పవిత్రమాయెను నాపాలిభాగ్యలక్ష్మియగు సీతమూలకమున నీయవతారపురుషుఁడు నాయల్లుఁడగు భాగ్యమిచ్చెను. ఇది తమ సంపూర్ణానుగ్రహముగాక వేఱొకటికాదా. గురువరా. నాబాల్యమిత్రుఁడగు దశరథుఁడు తన పుత్రుని వివాహమహోత్సవము కన్నులారఁగని సంతసించును. కావున నామహానుభావునకు నాహ్వానపత్రిక పంపెద.

విశ్వా.—జనకా! తమయింటగల మఱి మువ్వురాడిబిడ్డలను లక్ష్మణభరతశత్రుఘ్నుల కిచ్చి పరిణయ మొనర్చిన బాగుగ నుండును ఇంతకంటెను శ్రేష్ఠతములగు వరులీ ప్రపంచంబున నీకు దొరకరు.

జనకుఁడు.—మునికులోత్తమా! తమయాజ్ఞానుసారము వర్తించెద. స్నానమునకుఁ బోవుదము ప్రొద్దైనది.

(నిష్క్రమింతురు.)

శ్రీ

సీతాకల్యాణము.

తురీయాంకము — ప్రథమరంగము.

(రావణుఁడు - మండోదరి - మాయాసీత.)

రావణుఁడు.—మండోదరీ! అతిసాహసమున నీసామజయానను మిథిలనుండి తెచ్చికొంటిని. ఇదియవివాహిత కావున నే నీసుందరిని దారఁగాఁ జేసికొనియెద. నీకిది సమ్మతికదా?

మండోదరి.—ప్రాణప్రియా! ఎంతటిపతివ్రత భార్యయైనను దనకు సవతికలుగుననిన నించుక దుఃఖించును. నాకునలవాటుబలమున నట్టిదుఃఖము లేకయున్నను నీమానినిమోముఁ జూచినకొల్లను నాకు వేఱొకదుఃఖంబు ప్రాప్తిల్లుచున్నది.

రావణు.—ప్రేయసీ. కతేమి.

మండోదరి.—నాథా! ఈనాతి మనకులము పాలిటిమిత్తిగ నగపడెడు.

గీ. నాథ యీనాతిఁ గాంచిన నాదుమనము
భీతినందుచు నేలొకో బెదరసాఁగె
కంఠసూత్రమదేలొకో కదలసాఁగె
కంకణంబులు పగలెను కనుము కనుల.

ప్రాణనాథా! ఇకార్యకారణంబును జక్కఁగ యోజించి మనదేశమునకును, మనబంధుమిత్రులభద్రమునకు మనపిల్లలకుశలమునకు మనయభ్యుదయమునకు మీరీనారిని సోకక మిథిలలో వదలి వచ్చుట శ్రేయోభివృద్ధికిఁ గారణంబగు.

రావణుఁడు.—(కోపమున).

కం. విడువిడు జడజాక్షీ నీ
వాడఁగుఁదనంబిఁకను నీవు వదలుము చెడుగా

విడువను నే నీసతినిక్
గడియిక్ దెచ్చితిని చాలకాలంబునకుక్.

మండోదరీ యిట్టిమాటలాడితివేని నీవు నాప్రేమకు దూరురాలయ్యెదవు.

మండోదరి.— ప్రాణనాథా! తమమానసమునకు విరుద్ధముగ నేమాటలాడ నేల. మిన్నకపడియుండెద. వెడలిపోయెద.

రావణుఁడు.—(మాయాసుందరినిజూచి) సీతా! భీతికిఁకఁ గారణంబు లేదు. శాతోదరీ! రాముని శాతశరంబులకు నేను నైవసోప. రాక్షసవివాహంబునకు బలాత్కారసంయోగమే మంత్రము. మారుఁడే పురోహితుఁడు. శయనమే వివాహవేదిక కావున నీవిఁక నాదారవగుటకు సిద్ధపడుము.

మాయాసీత.—ఛీ! పలువా! నీ తులువపలుకులిఁకఁ బలుకకుము. నావీనులకవి ములుకులై నాటుచున్నవి.

రావణుఁడు.—సీ. అలరులవిలుకాని చిటకులకునుజిక్కి—
వెలఁదినీకలయికకు వలచినాఁడ

మా. సీత.— యమదమాదులమించు విమలాత్ముఁడవునీవు
సుమనాశుగాళికి స్రుక్కనగునె

రావణుఁడు.— తరమటే తరుణి యీ తనుతాపమోర్వఁగ
శరణను వాఁడను కరుణఁగనుమ

మా. సీత.— వలదురా యీకోల దలఁపకురా; దైత్య
కులకాలమిలుఁగాల్చు కలుషమిదిర

రావణుఁడు.—గీ. బాల, నీకేలవలపదీ గోలతనము

మా. సీత.— కూళ నీకేలయీలీల నాలితనము

రావణుఁడు.— లోలలోచనయేలము లేలబాల

మా. సీత.— మేల మోఖల కలుషాల వానమిదిర.

రావణుఁడు.—అంగజాసుందరీ! కలఁతలపలుకులఁగయ్యమునకుఁ గాలుద్రవ్వుటకంటెను కలయిక పలుకులఁ గా యజునికయ్యమునకుఁ గాలుద్రవ్వరాదా? కాలవిళంబమేల?

మాయాసీత.—ఓరీ ద్రోహీ.

ఉ. కాముని కైవశుండవయి కైతవవృత్తినిఁ గాంతఁబట్టుచుఁ
గాముకవృత్తిఁబూనియిటు కాదను కార్యము సేయన్యాయమే
సేమమె, సేమమే హితమె నీతియె ఖ్యాతియె యెన్నుమా మదిన్
తామసవృత్తిమానుచును దానవనాయక కీర్తినందుమా.

ఓరీ! కులకంటకా! నిఖిలాగమవేత్తవై పులస్త్యబ్రహ్మవంశంబునఁ బుట్టి సకలశాస్త్రంబులు చదివి సమస్తనీతివిద్యాధురీణుఁడవై ధీరుఁడవగు నీవు మదనాధీన పరతంత్రుఁడవగుచు మతికుదురుఁజెదరి యొకమదిరాక్షికై కులశీలంబులంద్రోసి యిటు వానిని జెరఁబట్టినచో రావణుఁడింతటి దుర్నీతియని జనులు నిందింపరా?

అనుబంధము 33.

రావణుఁడు.—సీతా! రతిపతివాదంబులాడుతఱి నీతివాదంబులేల? జనకనందనా! మనసిజునిబాధ బలమాయెను. ఇఁకఁ దాళఁజాల. సరసకురమ్ము. సరసీజాంబకుని కేళినిఁ దేల్చుము.

మాయాసీత.—ఓరీ! దుష్కులాధమా! సీతా సీతాయని కూసెదవేల ఆ పునీతసీత నీకు దొరకునా? ఆ భూజాత యాదిలక్ష్మి, నీకుల నాశనంబునకై భువిఁబుట్టినది. నారాయణాంశమున మానవరూపమును ధరించి రాముఁడను పావననామమున నయోధ్యనుఁ బుట్టి శివధనుర్భంగమొనర్చి మిథిలలో నేఁడు సీతను పరిణయింపఁగుచున్నవాఁడు. నీవు వంచకుఁడవై మాయారామునివేషంబుఁ బూనిన కారణంబున విశ్వామిత్రుల మానసపుత్రియైన నేను మాయాసీతనై నిన్ను వంచించితిని. తానొకటితలఁప దైవము వేఱొకటి తలఁచుననునది నీయందు సిద్ధించె. ఓరీ దుష్కులాధమా. ఇఁకనైన బుద్ధిఁదెచ్చికొని బ్రదుకుము. నీవు వంచకుఁడవు కావున వంచితుఁడవైతివి.

రావణుఁడు.—(కోపమునఁ గృపాణమెత్తి) ఓసీ దుశ్చారిణీ. ఇపుడు నిన్ను నఱకెదను.

మాయాసీత.—ఓరీ! దుర్నీత! దుష్టా, దురాత్మా, దుష్కులాధమా. నీచేతికి నేను దొరకుదునా.

అనుబంధము 34.

(అనుచు భూమిలో మాయమైపోవును.)

రావణుఁడు.—(ఆశ్చర్యమంది చింతించుచు) హా! హా! దైవవిచేష్టితంబులు దురూహ్యంబులు. చేకడివాఁడప్పెను. వంచకుఁడనై వంచింపఁబడితిని. ఏమిసేయుదు. ఏటులనయినను సీతనుబట్టి తేవలయును. నేనకార్యంబు ప్రాణమున మానను.

చం. అలవనవాటినేఁగనినయంగన యగ్నినిఁగాలిపోయె; నేఁ
గలశేముఁదెచ్చిచూడ నదిగాంతఁగ నాకృతినందిపోయె; భూ
తలమున సీతఁగాఁదనువుఁదాల్చెన, పట్టఁగమాయమాయె, నా
కలికినిమానఁ బ్రాణమున, గాలునిప్రోలును, జేరియుండినన్.

(నిష్క్రమణము.)

ద్వితీయరంగము.

వివాహమండపము.

(వధూవరులగు రాముఁడు మొదలగువారు పెండ్లిపీటలపైఁగూర్చుండి యుందురు. పురోహితుఁడు మంత్రాక్షతల పళ్లెరము తీసికొని యందఱకు మంత్రాక్షత లిచ్చును. విప్రులాశీర్వదింతురు. ముత్తైదువులు హారతి యెత్తుదురు.)

అనుబంధము 35.

సంపూర్ణము.

(Appendix) అనుబంధము.

అనుబంధము 1.

హంసధ్వని రాగము — రూపక తాళము.

సూత్రధారుడు — దివిజవినుత వేడెదా దీనబాంధవా
భవకలుష పరిహార నీభారమున నను బ్రోచుట ॥ది॥ ౧॥
నయవినయము మీరా - నగధరా నిన్నూ
భయభక్తుల నుతులను నే అనిశయము భజింతురీ
వనజభవా కావుమా విజయ శ్రీనివాసునీ ॥ది॥ ౨॥

అనుబంధము 2.

ఆభోగి రాగము — ఆది తాళము.

నారదుడు — భవనాశరా భక్తరాజీ బ్రోవ భావమందు నిన్నుఁ గొల్తు
కాలకాలముల్ గలుషహారి శౌరి కాంచెదనునిన్ను శ్రీ శ్రీనివాస
నతలోకవరదుని నిమ్మతినీగాద బిందువేమ్యని నిన్నూ యఖిలలోకపాలక
యనిశంబు నతిప్రేమఁ బ్రోవరా వ దేలదేవా॥

అనుబంధము 3

అఠాణ రాగము — రూపక తాళము.

నారదుడు — వేదాంత వేద్యుఁడీవని వేనోళ్లఁ బొగడు
చుందును; నీకు వందన సకలలోక బాంధవా
నుతి శరు రాసుభాన్విత
నీ మహిమ తనగవినగ నా నాలుకకునిశక్యముగునా
సర్వలోకంబు లెల్ల నెగడె బ్రహ్మానందముగ్నుఁ దైతినయ్యా ॥వే॥
నీతిసంచరణ శ్రీకరణ జలరుహ చరణ
వితరణ కలుషహరణ నతజన సుతపద సురతను
ఇందిరామనోహరా బ్రోవుమా ॥వే॥

అనుబంధము 4.

భాగేశ్రీరాగము—రూపక తాళము.

లక్ష్మీదేవి.— విచారమాయె నాథాయేమిసేయ యశివరుడయ్యో
నీమాయామతిసేయా విభుఁ బాయా ॥అ॥
సుఖసౌఖ్యముల నవిడి సకలసిరిసిరి విడి
అనయానవ్యసన వార్ధినిబడి భూమినెటులుండుదు॥ ౧॥

అనుబంధము 5.

రాగము—తాళము.

తుంబురుఁడు.— సదయాహృదయ మోదరుండ రారా ననుగావరా
ముదినిన్ను నమ్మెదాను నానను గావరావ దేవదేవ ॥అ॥
నీనామము ధ్యానించిన నెటిముక్తి యీరాదా
జ్ఞానంబును హెచ్చించెడు కారణమది గాదా ॥
పాపము లెడబాపెడు ఘనుఁడీవనఁగా లేదా
తాపమందు నన్ను జేయు శ్రీహరి నతమోదా॥ ౧॥

అనుబంధము 6.

లతాంగిరాగము—ఆదితాళము.

తుంబురుఁడు.— ననుఁగావఁగరావేల గోవింద - గానలోలశౌరి వేగమ్ముగా॥
పలుకీతుల గొలువంగఁగోరి ప్రార్థింతునిన్ను పదదాసుఁడ॥అనుపల్లవి॥
కామితార్థదాత నీవనినే భజియింతుగాదే శ్రీనివాసనుత
శౌరిబానుమా, దేవదేవననుఁ బ్రోవఁగనురా యాలస్యమేల॥ ౧॥

అనుబంధము 7.

రాగము—తాళము

లక్ష్మి.— నామోహనాంగ నిను నేనుగూడి సౌఖ్యమునాకుగలనెటుల॥
సుఖముల బాసి నినునేను బాసి దేహమునానుండి మనుటెటులా॥
కావగరారా మాధవవడిగా బ్రోవను నీవెనాగతిగా॥
నాప్రాణేశ్వర నినుగనకుండిన మనగలనెటులా నతశీల ॥
అభినవ సుందర నన్ను బ్రోవరా వేగము ధరజేరఁ జనులా॥

అనుబంధము 8.

బిలహరి రాగము—ఏక తాళము.

రావణుఁడు—నాకిఁక నెవరిల సాటి ధరిత్రీకాంత రాజ్యముల
జేసినేను వీరవార పూరయోర అనఁగను
భోరాడి గెలుచు నరాధములను జేరిచితి
ఇంకెవను నాతోసమముగ మాటలాడు వారు లేరు ధరణి ॥నా॥

అనుబంధము 9.

అఠాణా రాగము—ఆది తాళము.

రావణుఁడు—ఎచటనుంటినిన నెందుఁబోయిన నసురరాజేశు కథలు వినవలె ॥పల్లవి॥
యశము పెంచి దిశలు జొచ్చి (గాలెను
యశవృత్తముగ హృదిని నెంచవె పొందము ॥అను॥
దేవలోక మెల్లనిండి నెగడఁగ సురవరుండు దిగులొందఁగా
పరుల నేల పలుక నేల పారియె వెలిబిదాఁగె వార్ధిపడఁగనూ ॥ఎచ॥
భూన భోంతరములు నీభుజసాహస విభవములు
దొన్నను హృదయమందు మునము గాంచిన దయిత
సీతజనులను మనుపుడు దితికులవర ॥ఎచ॥

అనుబంధము 10.

బ్యాండు రాగము—ఏక తాళము.

కిష్కాదేవి.—ధీ పాతకి పలువా ఘనతఁగనవా
చెడుగులిటు చేయక ధీ ధీ ధీ
వనితను నీవు వనరఁగ బలుక నొనరును నీకు ఘనకలుషమ్ము
కను మిది ఖలవినువినిచెదవినరా ॥ధీ॥

అనుబంధము 11.

రాగము—తాళము.

మండోదరి.—హా స్త్రీ వధయు న్యాయమా సారిచంబ విహిత
ముగునె వలదువదలు మన మోహనాంగ ॥హా॥

బ్రహ్మకులంబున కధీశుఁడై యఘంబు నేయ నేల
ప్రాణేశ నావచనము వినులకా వినుమాను భుజాళను ॥మ॥

అనుబంధము 12.

పీలురాగము—రూపకతాళము.

నారద.—మాధవా శ్రీధవా భూధవా
కావరా వాసవా జనార్దన వాసవా జనార్దనా ॥పల్లవి॥
జనకుని కాంచితిగా ధన్యుడైతి సంతసాము నీక
నీభువి మాధవా వాసవా జనార్దన వాసవా॥ ౧।

అనుబంధము 13.

నోటు శంకరాభరణరాగము—ఏకతాళము.

విశ్వామిత్ర.—కల్లరికలుష కర్ముఁడవు ఖలాచారాకులాధమ ఛీ॥
వాదమేలా వచనము తప్పగ రాదురా యఘమేదురా
ఈ పాపము యేపారుచు నినుగాల్చును గనరా పాపీ
నినుఁగన కలుషంబౌదవును వదలుచు వెడలెదగను నను ఓపాపీ॥

అనుబంధము 14.

బేగడరాగము—ఆదితాళము.

దశరథుఁడు.—మీ పదదాను డా తాపసీ రత్నము
చూపుమా కరుణానను తాపము దలపక
మీపని సల్పుచూ దాపున నుండెద
మునివరకరుణను చనవున ననుగను
వినయ విధేయుడైతి స్నాతుఁడయి ॥మీ॥

అనుబంధము 15.

హిందూస్తాని కానడరాగము—ఆదితాళము.

విశ్వామిత్ర.—ముదముండెను మది నేడు చాల రామచంద్రుని మోము నుగాంచీ
వరకార్యము ధరలోఁగనము శరసై పుణ్యమెల్ల నొసంగీ
క్రూరుల బాధలా గూల్పనసుఁగదా తాటకి నార్పగ తలఁచినా రామ ॥ము॥

అనుబంధము 16.

మాండ్ రాగము—ఆదితాళము.

రాము.— అతి పవిత్రుడైతి స్నాతుడయి
శరయూతీరము జేరినారము గూడి
మోదము మీరి స్నాతుడయి ॥అతి॥

అనుబంధము 17.

శ్రీరంజని రాగము—ఆదితాళము.

బాలకులు.- ఆనందమాయెనూ మానాసము మానాసము
శరసాహసము ఘనయానందమాయెను చాలఁగను
దీనావనాఘనా మానసధనా మానసము శరసాహసము॥అ॥

అనుబంధము 18.

శంకరాభరణంనోటు—ఏకతాళము.

రాము.— ఆహా ఆహా ఆహా అసురాళీ మాయలు
గగన తలమునిండార తమముగన మీరెను
నిశాటచర్యలు రా వె ఆశుగమా రా వేగమే
కౌణపుమాయా బలమ్ముఁబాయఁ జేయావె శరజాలమా।
మానిత మానసముదాము రఘురాముని కరమున నిలుమా॥ఆ॥

అనుబంధము 19.

మోహనరాగము—తాళము.

విశ్వామిత్ర.—ముదిమోదమ్ము గదిసెను మిగుల మాదారు ప్రేమ
పదిలమాయెనునీ దగు పుణ్యము సాధనమయె
శుభవతీ తనయఁగ గనివెలయ ॥ము॥
నిరవధి సౌఖ్య నిరతము గానఁగా నిరుపమకీర్తిని
ధరను నిలుపఁగా కరుని నినుసేవక పరులుగొల్వఁగ
ధరణిని శుభముగా నేలుచునుండుము ॥ముది॥

అనుబంధము 20.

జింగ్లా రాగము—తిశ్రగతితాళము

విశ్వామిత్ర.—రఘురామా సతతాలోక పాలనా।
మదిసంతోసము మదికానందము
మదిసంతోసము కలిగేను నా రఘు॥పల్లవి॥

రామ.—మనమానందమును జెందె నేడునా॥నా॥
మదిసంతోసము మదికానందము
మదిసంతోసము కలిగేను నా ॥మన॥ పల్లవి॥

విశ్వా.—రామరామ నే నిను మదినినమ్మెదరా నేను మదినినమ్మెదరా
నను కరుణగాంచుమా॥రఘు॥ ౧।
రమ్ము వేగమే నీవు నాదు వెంటనిక
వెగానాదు వెంటనిక రమ్ము వేగమే। ౨।

రామ.— గురువరా నే నిను మదినినమ్మెదరా నేను మదినినమ్మెదరా
నను కరుణగాంచుమా॥మనమా॥ ౧।
రమ్ము వేగమే శ్రీహరి నాదుపాలికి
వేగనాదు పాలికి రమ్ము వేగమే। ౨।

అనుబంధము 21.

శ్రీరాగము—రూపకతాళము.

అహల్య —ముదమందితి హృదయమున సదయామతి రామచంద్ర
మునివినుతా యిణశశిత దినాధిపదపూజితా
కనులారగను నినుగని మనమారగ నీకరుణగని ధన్యను నైతిగదా।

అనుబంధము 22.

రాగము—తాళము.

మండోదరి.—మనవిని వినుగను శాంతి మానుమ కోపము
పరయింతి తరుణుల హింసలు తగదని పెద్దలు
వచింపరేబలు తలపుమ మదినీత్వరలిడనేల
వదలుమా ఈ దెస నేను ప్రేమనుగనుమా।

అనుబంధము 23.

రాగము—తాళము.

రావణుఁడు.—పోయివత్తునే నా మీఁద దయయుండానీ ॥పల్లవి॥
నీవియోగమునే సైపజాలనే ॥అను॥
కృపమారవాకు నీయుపచారమునే నేపుడూ
మరవానునే యలనాగరో॥ ౧॥

అనుబంధము 24.

ఇంగ్లీషునోటురాగము—త్రిశ్రగతితాళము.

విశ్వామిత్రుఁడు.—శుభముఁగాంచి మరలిరావె సుఖముగను
అసురును సురును దీయపడిచనా ॥ప॥
సురలకు మోద మొనరఁగ నిలుపుము
తరుణిరో మఱవకు పనివిని చనుమిఁక ॥శు॥అను॥
అసురేశునిఁ గలయక బూమెలు నేరయక
మాయలచే బాధింపుసదా
జనపాలనమతిని బూనుచుమదిన్
చేయుముదీని ముదంబ్బుగనీ॥

అనుబంధము 25.

పీలురాగము—ఏకతాళము.

భామిని.—చేయుదు మునీ విధేయమతినై వినివిని చనియెదఁ ఘనమతినగుచు॥ప॥
ఆదను జాడము బాధలనిడుచు మోదమునా నిను
జేరుదు జనకానాదు పంథము నిత్యము॥ ౧॥

అనుబంధము 26.

రాగము—తాళము.

సీత.—బాలకనుకు యూపవన పవనము వీచునూ హాయిగా మదముయేః॥ప॥
త్రిజటంవక.—మాతా సీతా మేలా॥

సీత.—వారిజాక్షీ మాను వారిజములను వారకకనుము
భూరిగముదము మానసతలాము నా॥

ప్రియంవద —తరుల తలముఁగాంచుమా తపంబు నిండెదట్టునై॥

సీత.—మోవమాయెఁగాను మాప్రియంవదా మనము్మనా॥

అనుబంధము 27.

చక్రవాకరాగము—రూపకతాళము.

మాయాసీత.—నరహరి సీనామేను వారక భజియింతు॥వ॥
భావము నాదు వంథమెుప్ప భావమున గాంచిరార।
మాయావి దశగ్రీవుడవు మునీశానినుగనుమా।
బాధించును వధియించును వేరారా దేవదేవ।

అనుబంధము 28.

హిందూస్తానితోడిరాగము—ఏకతాళము.

మా సీత —మదనా మోహనా సమా రూపావేగరారా
సమరూపావేగ రారా ॥మద॥పల్లవి॥
మనశిజబాణాహతులకు దాళా ॥మద॥ ౧।
తాళ తాపము తడయక వేగరారా ॥మద॥ ౨।

అనుబంధము 29.

రాగము—తాళము.

మాయారాము.—వలదు చెలియ ఖలవాదము లేల
కదియవగోల కంతుని మలకల యేలిక చేల।
మారుతాపమునకా దాళితిచానా రావేకరియానా।
నిలువఁజాలా కానవేలా నాగతిగను కనులా
ఇఁక జాలము చేల వగలా నెగఁలా కనలా।

అనుబంధము ౩౦.

శంకరాభరణం నోటు — ఏకతాళము.

మా రాము.—మధుమాసమున తరుజిరోబహలికి కరుణను గనిననుగా బొందుమా॥

మా సీత.—మరియూరపేను మదిరాక్షులి మాటలారతి గోరంగా॥

మా రాము.—మారుబారి మీరంగాను దారిగానసైతి
నిరంతరముగను దలంతునినుమది నిజమ్ము మదవతికను మా కరుణను॥

మా సీత.—చంచలామతిగను నెంచకు వంచనపదలుదు చనదిటు బోపొమ్మాచాలింకను

మా రాము.—నిను విడను.

మా సీత.—నినుచేరను.

మా రాము.—చలమువుంటగా ఫలమె చెలియగను మారుని యానవిను॥

అనుబంధము ౩౧.

మాలకంస్ రాగము — ఆదితాళము.

రాము.— శంభో సుఖసద నాత్ర్యంబక సకల శివకరా సుగుణనిధానా॥శంభో॥పల్లవి॥
అమరేశ్వరనుతచరణా గుణ గణగానా మునివరధ్యానా
సుఖకర శర్వా సతతము మనాంబుజంబున భజింతు నేసదా ॥శం॥ ౧॥
విశ్వేశా శుభంకరా సురేశ్వరా సదాశివా
సుగిరా ముఖరా సుఖదా వరదా హరా పరాత్పరా పుమావరా॥
త్ర్యంబక సకలశివకరా సుగుణనిధానా ॥శంభో॥ ౨॥

అనుబంధము 32

రాగము — తాళము.

రాము.— జగదీశదయా ఘనదేవా నామనవిని విను భరతురామా ॥జ॥
కానను నీకు సాహాయ్యము భూమిగనా
గుణధాము తాము రామా ప్రీతిగా గాంచి పాలించుమా
చిర సుఖదాయక నిరతము కరుణానను
గావుము ధరమునగను చేసీ॥

అనుబంధము 33.

వృశేనిరాగము—ఆదితాళము.

సా॥ సీత.—చెడుఁగద, నర జెనకకురా చెనఁటులచే చేటురా।
జడమతి నీ పెరమతులు విడుమనరా సౌఖ్యముగా।
పరసతులా పరిభవము దురితమురా నరకమురా।
పరసతులు అలిగిననీ పరబలము వచ్చురా।

అనుబంధము 34.

రాగము—తాళము.

సా॥ సీత—ఖలమాయలిఁకేలా మాయలిఁకేలా కులమునుగలమనుమాయలిఁకన్ పదలు।
పలువలిపలుకులు పలుకనగు నెఖల వలమర పాపము మాయలిఁకేలా।
మాయలచేఁతలు మపి చెడుగానుర మదమునుగానర మానవిహీనా॥ఖ॥

అనుబంధము 35.

ఝంఝూటిరాగము—రూపకతాళము.

శ్రీవరా మురా సురా హరా కరుణా భరణా
నిజభక్తభరణ చారుతరుణ శోకహరణ ॥శ్రీ॥
నీకోమల పదసారస భక్తిదానమునన్ నీ
కైవల్యపదసౌఖ్యము ప్రాకటముగనన్
నాకునుసంగముకరుణన్ జాబ్బితిశరణున్ నాకీ
వినుతా కరిసౌఖ్యకృతా సువినుతా దీనహితా దేవనుతా ॥శ్రీ॥

సమాప్తము.

పౌరాణికములు, రామాయణ నాటకములు.

1. శ్రీరామ జననము.
2. సీతాకల్యాణము.
3. పాదుకా పట్టాభిషేకము.
4. లంకాదహనము.
5. కుశలవ నాటకము.

భారత నాటకములు.

1. ద్రౌపదీ వస్త్రాపహరణము.
2. కీచకవధ.
3. శిరోమణి నాటకము. [హన నాటకము.
4. అర్జున గర్వభంజనము లేక బభ్రువా

హరిభక్తి రసపూరితములు.

1. ప్రహ్లాద.
2. రుక్మాంగద.

నాయికా పాత్రపోషణ చమత్కృతములు.

1. గిరిజా కల్యాణము.
2. సీమంతిని.
3. మదాలస.

దైవఘటనపై చిత్రిమంతములు.

1. సత్య హరిశ్చంద్రీయము.
2. భోజప్రబంధము లేక కాళిదాస నాటకం
3 చంద్రహాస.

స్వకల్పితములు.

1. సునందనీ పరిణయము (అద్భుత నీతి పూరితము.
2. యువతీ వివాహము.

ఆంధ్రీకరణములు.

1. రామసీ మహాత్మ్య శాంతు.
2. మానాపమానము.

For coppies—Apply to,

K. SATHRUGHNA RAO,

Civil lines, BELLARY.

బృహజ్జాతకము 2-0-0 గ్లేజు	3-0-0
కాలచక్రము 1-0-0 గ్లేజు	1-8-0
జ్ఞానప్రదీపిక అను మళయాళ ప్రశ్నలు వెల	5-0-0
తిలకఫల విజ్ఞానమను పుట్టుమచ్చల ఫలము	0-3-0
కేరళపంచపక్షిప్రశ్న శాస్త్రము	0-8-0
రసయోగ రత్నాకరము	2-0-0
సుశ్రుత శారీరస్థానము	2-8-0
సర్పశాస్త్రము	0-8-0
షర్బత్ పాక రత్నావళి	0-6-0
సహదేవ పశుచికిత్స	0-6-0
వైద్య శతశ్లోకి	0-4-0, 0-6-0
అనుపాన మంజరి	0-8-0
నాడీనిదానము తాత్పర్యం	0-4-0
నాడీజ్ఞానము	0-4-0
బ్రహ్మవిద్య	0-2-0
శుష్క వేదాంత తమోభాస్కరము	3-0-0
సీతారామాంజనేయ సంవాదము సంగ శేషాచలశాస్త్రిగారి ఆంధ్రటీకా తాత్పర్య విశేషార్థ సమన్వితము వెల 3-8-0 గ్లేజు	6-0-0
కైవల్యనవనీతము	5-8-0
ధ్యానామృతం	0-6-0
సమ్మోహనశాస్త్రము అందు అదృష్ట రాజము	1-8-0
అభ్యాసన చక్రము	0-4-0
వేదాంత భక్తి కీర్తనలు	0-1-0
యాజ్ఞవల్క్యప్రయోగ చింతామణి	2-0-0
వ్రతచూడామణి	2-0-0
సకల మంత్రోపాసనక్రమము	0-6-0
దేవీస్తోత్రకదంబము	0-8-0
శివస్తోత్రామృతం	0-4-0
కవిచౌడప్ప శతకం	0-2-0
కల్కిపురాణము	0-12-0, 1-4-0
తెనాలిరామలింగని కథలు	0-4-0
రంగదాసు భజన కీర్తనలు	0-4-0
సుశీల మైనావతి	0-8-0
మరకతవల్లి	0-10-0
కమంతసేన	0-4-0
దొరికితివిరా దొంగ	0-6-0
నేనే దొంగను	0-8-0
విషాద వాసంతిక	0-6-0
వలపుల మడుగు	0-4-0
శకుంతల జనన నాటకం	0-8-0
వైకుంఠ మహాత్మ్యం	0-8-0
ఉషాకళ్యాణం బాణాసురయుద్ధం	0-12-0
కపటవేశ్యా నాటకం	0-10-0
మైరావణ నాటకం	0-8-0
ధర్మాంగద నాటకం (పాలుట్ల)	0-6-0
ఉషా నాటకం (తిరునగరు)	0-4-0
వీరభద్ర నాటకం త్వరకవి	0-10-0
పడకటింటి రహస్యాలు	1-0-0

ఇంకా అనేక రకములు గలవు.

☞ కాలమానపరిస్థితుల ననుసరించి ధరలు మారుచుండును.

చిరునామా:— ఉప్పల లక్ష్మీకాంతమ్మ, బుక్ సెల్లర్ అండు పబ్లిషర్.
జయశంకర్ అండు కంపెని; 13/79, బొడ్డు రామయ్యగారి సందు;
బురుజుపేట, విశాఖపట్నము.

నవీన ప్రింటర్సు, విశాఖపట్నం. 8-11-51.